179

సెప్టెంబర్ 1990

సృజన

ఆధునిక సాహిత్యవేదిక

మాసపత్రిక

సెప్టెంబర్ 10

సంపాదకీయం

తిరిగి తిరిగొచ్చింది...

కె. బాలగోపాల్

శ్రీశ్రీ కవిత్వం - చలచంచల సౌందర్యం

జె. సి.

రిజర్వేషన్లు అనివార్యం

ఎన్. వేణుగోపాల్

నిర్వహణ

'సాహితీమిత్రులు'

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

179 మాసపత్రిక సెప్టెంబర్ 1990

ఈ సంచికలో

నిర్వహణ

'సాహితీ మిత్రులు'

సంవత్సర చందా రు. 40 ఈ సంచిక రు. 4

Edited, Printed and Published by P. Hemalatha, Flat 11, Block 2, MIG II, Bagh Lingampalli, Hyderabad 500 044 and Printed at Nagendra Press, Vijayawada - 520 002

Working Editor Vara Vara Rao

సెప్టెంబర్ 10

నేను తాగిన కాలువలోనే నువ్వు నీళ్ళు తాగుతావా? నిన్నేం చేస్తానో చూడు అన్నదట వెనుకటికో తోడేలు మేకపిల్లతో. నేనా కాలువలో నీళ్ళు తాగలేదు అని అమాయకంగా వణికిపోతూ చెప్పిందట మేకపిల్ల. ఇవ్వాళకాదు నిన్న అని గద్దించిందట తోడేలు. అసలెప్పుడూ నేనా కాలువపైపే రాలేదందట ఆ మేకకూన. నువు కాకపోతే మీ అమ్మతాగింది, మీకింత అహంకారమా-మీ కెన్ని గుండెలు- అంటూ మేకపిల్లపైకి లంఘించిందట తోడేలు.

ప్రభుత్వాలకు ప్రజాస్వామిక జీవన విధానాన్ని భగ్నం చేయడానికి ఈ మాత్రం సాకులుకూడ అక్కర్లేదు. జనవరినుంచి సెప్టెంబర్‌దాకా హైదరాబాదు నగరంలోగానీ, ఉత్తర తెలంగాణా జిల్లాల్లోగానీ, చింతపల్లి, అడ్డతీగల మొదలైన అటవీ ప్రాంతాల్లోగానీ, రాయలసీమలోగానీ, రాజమండ్రిలోగానీ జరిగిన ఏ సభలోనైనా ఆ సభలకు వచ్చిన లక్షలాది ప్రజలు శాంతి భద్రతలకు భంగకరంగా వ్యవహరించినట్లుగానీ, ఎక్కడా ఏ ఖాకీ దుస్తుల పోలీసు, బందోబస్తు ఉన్నట్లు కనిపించకున్నా క్రమశిక్షణ తప్పినట్లుగానీ దాఖలాలు లేవు. కనీసం అటువంటి షికాయత్ ఎవరినుంచీ లేదు. బలవంతంగా తీసుకొచ్చారనో, లారీల వాళ్ళను బెదిరించారనో అన్నారు తప్ప సభకు వచ్చిన జనం సమస్యలు సృష్టించారనలేదు. అయినా సరే ఆరు నెలలు తిరగకుండానే ఆరేళ్ళుగా అరుదయిపోయిన సభలు, సమావేశాలు జరుపుకునే ప్రాథమిక హక్కు మళ్ళా హరించివేయబడింది. అప్రజాస్వామికంగా అణచివేయబడిన ఒక మౌలికమైన భావప్రకటనా స్వేచ్ఛను, విప్లవోద్యమ ఒత్తిడిలో తాత్కాలికంగానైనా పునరుద్ధరించక తప్పని ప్రభుత్వం, ఇన్నాళ్ళూ అట్లా వ్యవహరించినందుకు సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన ప్రభుత్వం తాను స్వేచ్ఛ యిచ్చినట్లు, అది దుర్వినియోగం చేసుకుంటున్నట్లు మాట్లాడుతున్నది. అతిశయోక్తులతోకూడిన అభాండాలు వేస్తున్నది.

హైదరాబాదులో సెప్టెంబరు 10న జరిగిన రైతుకూలీ సంఘం ర్యాలీకి అనుమతి యిచ్చినట్లేయిచ్చి అసలు జనం రాలేదని అనిపించాలన్నది పోలీసుల దుష్టపథకం.

అప్పుడు, చూడండి, మేం రానిచ్చినపుడు జనం వచ్చారు. మేం చూసీచూడనట్లు ఊరుకుంటే జనం వచ్చారు. కార్యకర్తలు జనాన్ని భయపెట్టి బెదిరించి తీసుక వచ్చారు అని చెప్పడానికి వీలవుతుంది. ఈ తొమ్మిది నెలల ప్రభుత్వ విధానాలు — త్రిసూత్ర పథకం పనిచేసి ప్రజలు నక్సలైట్లకు దూరమయ్యారు, వాళ్ళ జనాకర్షణ శక్తి తగ్గిపోయింది అని ప్రచారం చేయడానికి వీలవుతుంది. ఇదీ ప్రభుత్వ దురాలోచన. కాని దుష్టపథకాలూ దురాలోచనలూ ఎప్పుడూ బెడిసికొడతాయి. ఆశించిన దానికి పూర్తిగా విరుద్ధమైనఫలితాలనిస్తాయి. కొన్ని విషయాల్లో ఇటువంటిని అక్కడికక్కడే చిచ్చుబుడ్లలా పేలిపోతాయి. కొన్ని విషయాలలో ఆలస్యంగా పేలే మందు పాతర్లవలె కాలంమీదగానీ తెలిసిరావు. 1985 నుంచి 89 దాకా తెలుగుదేశం ప్రభుత్వం అనుసరించిన విధానాలు 89 నవంబర్‌నుంచి ఎంత ఆత్మ వినాశకరమైనవో రుజువయితే, అందుకు అయిదు సంవత్సరాలు పడితే, ఇప్పుడీ సభయే చెన్నారెడ్డి అతి తెలివి ఎట్లా తెల్లవారిందో బట్టబయలు చేసింది. నిజంగా చెన్నారెడ్డి చీకటి కుట్రను, రాష్ట్రవ్యాప్తంగా చేసిన ఖాకీ కుట్రను రాజధాని నగరంలోని నియాన్ లైట్ల వెలుగులో పల్లెజనం తెల్లవార్లూ పదంకట్టి పాడారు. బొమ్మకట్టి పాడారు. ఇంకా ఎక్కడెక్కడో కురుస్తున్న చినుకులు కొండవాగులో, గట్లమీద పోగవుతున్న నీటి చుక్కలు కాలువలతో వరదలో చేరినట్లు రాత్రి పన్నెండు గంటలదాకా వచ్చిచేరుతూ వచ్చినిజం నిర్బంధపు అనుభవాలు చెప్పారు.

చివరి క్షణందాకా ఆశపెట్టి, ఎక్కడా అనుమానానికి తావులేకుండా ప్రవర్తించి ఊరేగింపుకు అనుమతి లేదన్నారు. అదేమిటి రైతుకూలీలు తమ సమస్యలపై తరలి వస్తామంటే అనుమతిలేకపోవడం ఏమిటి-రోజూ మీ అనుమతి లేకుండానే మీ కళ్ళ ముందే నగరంలో రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలు ఇన్ని అల్లరి చేస్తున్నాయిగదా అంటే - అదిగో అందుకే సరిగ్గా అదే కారణం అన్నారు. ఆ రోజు పెద్ద రిజర్వేషన్ అనుకూల ర్యాలీ వుందన్నారు. రెంటికీ మా బందోబస్తు చాలదన్నారు. (రిజర్వేషన్ అనుకూల ర్యాలీలకు, రాడికల్స్ ర్యాలీలకు మాత్రమే శాంతి భద్రతలకోసం బందోబస్తులు అవసరమన్నమాట). మాకు రిజర్వేషన్ అనుకూలురతో పేచీ లేదుకదా! పైగా మా సభకు వచ్చే జనం అంతా వాళ్లే. పొద్దున ఆ ర్యాలీలో పాల్గొని మధ్యాహ్నం ఈ ర్యాలీకి వస్తారంటే, వ్యతిరేకులు రెచ్చగొట్టవచ్చు నన్నారు. నగరంలో ర్యాలీని క్రమబద్ధం చేయడానికి చాలని బందోబస్తు నగరం చుట్టూ దినమూ రాత్రీ

ఇరవై నాలుగుగంటల ముందునుంచే వలయం పన్ని ప్రజలు ప్రవేశించకుండా దిగ్బంధనం చేయడానికి చాలింది. ఇది నగరానికే పరిమితమైన సమస్య కూడ కాదు. ఆదిలాబాదునుంచి అనంతపురందాకా శ్రీకాకుళంనుంచి నలగొండదాకా రెండు రోజులు పోలీసుస్టేషన్లు లారీల అడ్డాలయ్యాయి. ఎన్నికలు వస్తే పోలింగు సిబ్బందిని, సామాగ్రిని తీసుకపోవడానికి లారీలను స్వాధీనం చేసుకొని పోలీసు హెడ్‌క్వార్టర్సులో పెట్టినట్లుగా కనీసం మూడువేల లారీలను స్వాధీనం చేసుకున్నారు. తమవద్ద వుంటే రాడికల్స్ బలవంతంగా తీసుకపోతారని లారీయజమానులు తమంతతామే స్వచ్ఛందంగా ఒకరోజు ముందునుంచే లారీలు తెచ్చి పోలీసు స్టేషన్‌లో పెట్టారని ప్రకటనలు ఇచ్చారు. ఇది మనల్ని నమ్మమంటున్నారు. వందలాది పోలీసు లాకప్పులలో వున్న వేలాదిమంది ప్రజలు తమను తమ ఇళ్ళలో వుంటే రాడికల్స్ బలవంతంచేసి సభకు తీసుకపోతారు గనుక మీ కస్టడీలో పెట్టుకోండి అని అడిగారు, వాళ్ళ ఇష్టంగానే లాకప్‌లలో ఉన్నారు అని పోలీసులు చెప్తే నమ్మడానికి మనకు మెడకాయమీద తలకాయ లేని మేతావులెంతమంది లేరని- దొంగతనాలుచేసి, నేరాలుచేసి, రిక్షా తొక్కి, అమాలీపనిచేసి, కూలిపనిచేసి, విసిగి వేసారి పోలీసు లాకప్పులలోనే ఆత్మహత్యలు చేసుకోవడానికి వచ్చిన కథలు మన కెన్నిలేవని?

చేయదల్చుకున్న ఈ బీభత్సానికి ఒక తోదేలు సాకు డి జి పి రెండు రోజుల ముందే ఎంచుకున్నాడు. మోకాటికీ బట్టతలకూ ముడిపెట్టినట్లు సభకు లారీలో జనం రావడానికి సంబంధంలేని లారీ యజమాని వర్కర్లకు సంబంధించిన సమ్మె సమస్యలో పంచాయితీకి వచ్చి దౌర్జన్యం చేసి దెబ్బలుతిని తాగి మరణించిన ఒక లారీ యజమాని ఉదంతం జనగామలో జరిగిందని, కాబట్టి అప్రజాస్వామిక చర్యలను అరికట్టడానికి చట్టపరంగా వ్యవహరించక తప్పదని కఠినంగా హెచ్చరించాడు. ఆయన కళ్ళముందే నగరవీధుల్లో, ప్రధాన రహదారుల్లో రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనకారులు రోజూ వందల బస్సులను ధ్వంసం చేస్తున్నారు. గాలి తీస్తున్నారు, అద్దాలు పగులగొడుతున్నారు. హైజాక్ చేస్తున్నారు. ఇందుకు పోలీసు అధికారులు మౌన ప్రేక్షకులుగా వున్నారనడానికి రోజూ పత్రికల పతాక శీర్షికల పక్కన ఫొటోలే ప్రత్యక్షసాక్ష్యంగా రికార్డులలో వున్నాయి. నక్సలైట్ల రాజ్యాంగ వ్యతిరేక చట్ట వ్యతిరేక విశ్వాసం పట్ల, కార్యకలాపాలపట్ల సంపాదకీయాలు, వ్యాఖ్యలు రాసే పత్రికలకు

గానీ, వాళ్ళకు విశ్వాసంలేని చట్టాలు వాళ్ళకెందుకు వర్తింపచేయాలి, దేశద్రోహంలకు దేశ న్యాయసూత్రాలు అడిగే హక్కు లేనేలేదని వాదించే వాళ్ళుగానీ రాజ్యాంగ ఆదేశక సూత్రాలను ప్రాథమిక హక్కులను కోర్టు తీర్పులను ప్రశ్నిస్తూ, కోర్టులపై ఒత్తిడి తీసుకరావడానికి కోర్టులముందు ప్రదర్శనలుచేస్తూ న్యాయవాదులను కోర్టులలోకి వెళ్ళకుండా చేసి, తీర్పుపై ప్రభావం చూపాలని చేస్తున్న ప్రయత్నాలగురించి, బల ప్రదర్శనలగురించి ఏమంటారు? వేల సంవత్సరాలుగా పోరాడి ప్రజలు సాధించుకున్న హక్కులను రాజ్యాంగాలు గుర్తించక, ప్రభుత్వాలు పాటించక అమలు జరగనప్పుడు వచ్చే ప్రజాస్వామిక ఒత్తిడికి, పాలకవర్గాలు వీటి నెదుర్కోవడానికి తెచ్చే ఒత్తిడికి తేడా చూడలేకపోతే మన చారిత్రక అవగాహన మాత్రమే కాదు, ప్రజలపట్ల పక్షపాతం కూడ శంకించాల్సి వస్తుంది.

అయితే ఈ అయిదేళ్ళ అనుభవమూ, తొమ్మిది నెలల అనుభవమూ- ఈ రెంటినీ మన ఆటుపోటుల అనుభవంతో పోలిస్తే - జోడించిన ప్రజలు ఈసారి మౌనంగా, ఉదాసీనంగా, వినయంగా ఈ అవరోధాలను స్వీకరించలేదు. తమకు తోచిన అన్ని పోరాట రూపాలను ప్రయోగించి సభకు వచ్చారు. భౌతికంగా బంధించి, ఎత్తుకపోయి లాకప్‌లలో పడవేస్తే తప్ప, పడవేసినాక కూడ ఆ రాత్రి దాకా వదిలి పెట్టకుండా ఉంటే తప్ప సభకు రాకుండా లేరు.

బీబీనగర్ దగ్గర భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ ఆపి రైలులో లాఠీ చార్జీ చేస్తే దెబ్బలుతినీ, తప్పించుకొనీ సభకు నడచివచ్చారు. పెద్ద అంబర్‌పేటవద్ద లారీలు ఆపి, టైర్లలో గాలి తీసి, గాలిలో కాల్పులు జరిపి, అదీ చాలక జనంపై కాల్పులు జరిపితే తప్పించుకొని సభకు వచ్చి ఆ సమాచారం అందించారు. గాయపడి ఆసుపత్రిలో చేరిన వాళ్ళ ఉదంతం చెప్పారు. పటాన్ చెరువు పారిశ్రామిక ప్రాంతంలో బస్సులన్నీ నడువకుండాచేసి రోడ్ల కడ్డంగా బెంచీలు వేసుకొని పోలీసులు కూచుంటే, కాలినడకన సభకు వచ్చి ఆ సంగతి చెప్పారు. శ్రీకాకుళం నుంచి రెండు రోజుల ముందు బయల్దేరి నాలుగు రైళ్ళు మారి పోలీసులకన్నా ముందు జాగ్రత్త పడి వచ్చిన వాళ్ళు వున్నారు. చౌటుప్పల్ పోలీసుస్టేషన్‌లో పెట్టిన లారీలకోసం జనం కోసం ధర్నాలు చేసిన వాళ్ళున్నారు. భూపాల్‌పల్లి, రేగొండ ప్రాంతాలలో ఆపిన ప్రజలకోసం సర్కిల్ ఎం ఆర్ ఒ ఆఫీసు ముందు ధర్నాచేసి విడిపించుకొని

రాత్రి పదకొండు గంటలకు చేరినవాళ్లున్నారు. ఘనపురం, బీబీనగర్, భోనగిరి రైల్వేస్టేషన్‌లలో, రోడ్డుపై గంటలపాటు నిరసన ప్రదర్శనను నిర్వహించి వచ్చిన వాళ్లున్నారు. అదీ సాధ్యం కాని చోట ఎక్కడికక్కడే సభలు సమావేశాలు రోడ్ల మీద నిర్వహించుకున్నారు. కాజీపేట ఓవర్ బ్రిడ్జిపై లారీలు ఆపితే ఆ లారీల్లోని జనం అక్కడే పోలీసు నిర్బంధాలను, బూటకపు ఎన్‌కౌంటర్లను, అదృశ్య హత్యలను ఖండిస్తూ నినాదాలు ఇచ్చారు. ప్రసంగాలు చేశారు. ఎందుకంటే వారిలో అటువంటి దారుణాలకు గురయిన వాళ్ళ కుటుంబ సభ్యులున్నారు. మృతవీరుల భార్యలు, తల్లులు, పిల్లలు వున్నారు.

కమలాపూర్ (గడ్‌చిరోలీ) లో గిరిజన రైతు కూలీ సభను జరగనివ్వక అడవిలోని బాటలన్నీ నిర్బంధం చేస్తే ఆరు సంవత్సరాల క్రితం అడవిలోనే ఎక్కడికక్కడ ఆదివాసులు సభలు జరుపుకున్నారు. అప్పుడు కమలాపూర్‌కు బాటలెన్నో నని - ప్రజలు ఆశ్చర్యపోయారు. ఒక సభ ఆపితే ఎన్ని సభలుగా అది పాయలైందో విని శత్రువు అప్రతిభుడయ్యాడు. ఇప్పుడు పాయిలయన నదీ ప్రవాహ ప్రభావం కనిపించింది. సముద్ర సంగమంలో నదీ గమ్యం కనిపించింది. దానితో రాత్రి పదకొండు పన్నెండు గంటల మధ్య జన ప్రవాహం ఇంకా సభలో ప్రవేశిస్తూ వుండే దృశ్యం అటు అనుమతి ఇచ్చి ఇటు అవరోధాలు కల్పించి విఫలం చేయాలనుకున్న కుటిల బుద్ధిని ఎడాపెడా ఎగతాళి చేసినట్లుంది. ఇన్ని అవరోధాలు కల్పించి, నిర్బంధించినా ఇంకా అశేష ప్రజానీకం వచ్చారు. గనుక ఎవరికైనా ఇంకెన్నో రెట్లు వచ్చి వుండేవారనే తప్ప వీళ్ళంతా బలవంతంగా వచ్చారనడానికి లేదు. ఈర్ష్యతోనైనా బలవంతంగా ఆపారని ఒప్పుకోవాల్సిందే తప్ప తెచ్చారని చాటుకయినా అనడానికి లేదు. గజం మిథ్య, పలాయనం మిథ్య అన్నట్లు అసలు లారీలే ఆపలేదు, జనాన్నే నిర్బంధించలేదు అని డి జి పి అనవచ్చు గానీ ఒక్క నాగర్‌కర్నూల్ డి ఎస్పీయే స్వయంగా నూటయాభై లారీలను ఆపానని, వాటిని వదిలేస్తున్నానని అంటే ఇంక డి జి పి అద్వైతాన్ని అంగీకరించడానికి ఎవరూ సిద్ధంగాలేరు. ఈ అనుభవం నుంచి పాలకులు ఏం పాఠం తీసుకుంటారో ప్రజలు గమనిస్తూనే వుంటారు.

21-9-90

— సంపాదకుడు

ఫోకస్ :

ప్రస్తుత స్థితిలో రిజర్వేషన్లు అనివార్యం

ఎన్. వేణుగోపాల్

వెనుకబడిన కులాలకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో 27 శాతం రిజర్వేషన్‌ను కల్పించాలని ప్రధానమంత్రి విశ్వనాథ ప్రతాప్‌సింగ్ తీసుకున్న నిర్ణయం ప్రభుత్వంలోను, పార్టీలోను, దేశవ్యాప్తంగాను తీవ్రమైన సంచలనానికి దారితీసింది. అనేక రాష్ట్రాలలో రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళన చెలరేగింది. పత్రికలు ఈ ఆందోళనను అతిశయోక్తులతోను, ప్రశంసలతోను ప్రచారం చేస్తున్నాయి. 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' నాయకత్వాన అగ్రవర్ణ మేధాశక్తులూ, వేరు వేరు రాష్ట్రాల్లో వేరు వేరు పేర్లు పెట్టుకున్న కాంగ్రెస్(ఐ), భారతీయ జనతాపార్టీ గూండా బలగాలూ ఈ ఆందోళనను ఆరిపోనివ్వకుండా కాపాడుతున్నాయి, 'పవిత్ర యుద్ధం'లా సాగిస్తున్నాయి.

ఈ గందరగోళంలో అసలు సమస్యకు సంబంధించిన వాస్తవాలూ, మౌలిక అంశాలూ మరుగున పడిపోతున్నాయి. రిజర్వేషన్ సమస్యకు సంబంధించిన వాస్తవాలనూ, రిజర్వేషన్ సమస్యలో ఇమిడి ఉన్న సామాజిక మౌలిక అంశాలనూ అవగాహన చేసుకున్నప్పుడే ఈ సమస్యపట్ల సరైన వైఖరి తీసుకోగలుగుతాము.

ఈసారి రిజర్వేషన్ సమస్య ఆగస్ట్ 7 నుంచి చర్చలోకి వచ్చింది. మండల్ కమిషన్ సిఫారసుల మేరకు దేశంలో సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు 27శాతం రిజర్వేషన్ కల్పించాలని తమ ప్రభుత్వం నిర్ణయించినట్లు వి.పి.సింగ్ ఆగస్ట్ 7న పార్లమెంటులో ప్రకటించాడు. ఈ నిర్ణయం కేంద్రప్రభుత్వ ఉద్యోగాలకు, కేంద్ర ప్రభుత్వ అధీనంలోని సంస్థలలో ఉద్యోగాలకు మాత్రమే వర్తిస్తుందని కూడ ఆయన అన్నాడు. ఈ ప్రకటనను పార్లమెంటులో అన్నిపక్షాలూ ఆహ్వానించాయి. ధరల పరిస్థితిపై జరుగుతున్న చర్చను ఆపి ఈ ప్రకటన చేయడాన్ని కాంగ్రెస్ (ఐ) ఖండించింది గాని ఆ చర్చ ఆగస్ట్ 8 దాకా సాగుతుంది గనుక, 9న దేవీలాల్ తలపెట్టిన రైతు ప్రదర్శనను దెబ్బతీసే రాజకీయ ప్రయోజనం కూడ ఈ ప్రకటనలో ఇమిడి ఉంది గనుక ప్రకటన ఆ రోజునే వెలువడింది.

మండల్ కమిషన్ సిఫారసులను అమలు చేస్తాననేది జనతాదళ్ ఎన్నికల ప్రణాళికలోని ఒక వాగ్దానం. మండల్ కమిషన్ సిఫారసులు స్థూలంగా వెనుకబడిన వర్గాలకు ప్రయోజనకరమైనవనే ఉద్దేశ్యంతో దేశంలో చాల సంవత్సరాలుగా ఆ సిఫారసులను అమలు చేయాలనే డిమాండ్ కొనసాగుతున్నది. అధ్యక్షుడు బి. పి. మండల్ పేరుమీద ప్రసిద్ధమైన ఈ వెనుకబడిన తరగతుల రెండో కమిషన్‌ను జనతా ప్రభుత్వం 1979 జనవరి 1న నియమించింది. ఈ కమిషన్ ఇందిరాగాంధీ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత 1980 డిసెంబర్ 31న తన నివేదికను సమర్పించింది. పది సంవత్సరాలుగా ఆ నివేదిక అతీగతీ లేకుండా పడివుంది.

నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం కూడ మండల్ కమిషన్ చేసిన సిఫారసుల నన్నిటినీ, కనీసం కొన్నిటినైనా అమలు చేయాలని నిర్ణయం తీసుకోలేదు. కమిషన్ చేసిన అనేక సిఫారసులలో ఒకే ఒక్క సిఫారసును, అది కూడా కేవలం కేంద్ర ప్రభుత్వోద్యోగాలకు పరిమితం చేసి అమలు చేయాలని నిర్ణయించుకుంది. మండల్ కమిషన్ నివేదిక సిఫారసులను అమలు చేయాలనే చిత్తశుద్ధి పాలకపక్షాలకు లేదనే వాస్తవం గత పదిసంవత్సరాలుగా రుజువవుతూనే ఉంది. అగస్ట్ 7న వి. పి. సింగ్ ప్రకటించిన నిర్ణయమయినా దేవీలాల్ ప్రాబల్యాన్ని అడ్డుకునేందుకు వేసిన రాజకీయ ఎత్తుగడ మాత్రమే గాని వెనుకబడిన వర్గాలపట్ల ప్రేమకాదు.

ఆమాటకొస్తే మండల్‌కైనా నిజంగా వెనుకబడిన వర్గాలపట్ల ప్రేమ ఉన్నదనీ, వారి అభ్యున్నతిని ఆకాంక్షించాడని చెప్పడానికి వీలులేదు. రాజ కుటుంబానికి చెంది, బతికినంత కాలం పాలకవర్గ రాజకీయాలలో, పార్టీల మార్పిడిలో గడిపిన బిందేశ్వరీ ప్రసాద్ మండల్ వెనుకబడిన వర్గాల నాయకుడుగా, శ్రేయోభిలాషిగా పేరు తెచ్చుకోదలచుకున్నాడు. కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక చట్రాన్ని మార్చకుండానే వెనుకబడినవర్గాల అభివృద్ధి కోసం కొన్ని సూచనలు చేశాడు. సామాజిక ఆర్థిక చట్రాన్ని మార్చకుండా ఈ సమాజంలో వెనుకబడిన వర్గాలకు, అణగారిన వర్గాలకు, దళిత వర్గాలకు, మైనారిటీ వర్గాలకు అభివృద్ధి అనేది సాధ్యం కాదు. అటువంటి నిజమైన అభివృద్ధిని ఆకాంక్షించక పోయినా ఉన్న వ్యవస్థలో సంస్కరణలను సూచించాడు మండల్. కనీసం ఆ సంస్కరణలనయినా అమలులో పెట్టలేనంత, సహించలేనంత అగ్రవర్ణ దురహంకారానికి లోనయి ఉన్నాయి మన పాలకవర్గ పార్టీలు.

మండల్ చేసిన సూచనలు వ్యవస్థ పరిధిని ధిక్కరించక పోయినప్పటికీ విస్తృత సామాజిక రంగాలను స్పృశించేవి. కేవలం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో మాత్రమేకాక అన్ని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలోనూ వెనుకబడిన కులాల అభ్యర్థులకు 27 శాతం స్థానాలు కేటాయించాలని మండల్ సిఫారసు చేశాడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధీనంలోని అన్ని సంస్థలకూ, ప్రభుత్వాలనుంచి ఆర్థిక సహాయం పొందే అన్ని సంస్థలకూ ఈ రిజర్వేషన్ వర్తింపజేయాలని కూడ ఆయన సూచించాడు. ఈ ఉద్యోగ రిజర్వేషన్లు పకడ్బందీగా అమలయ్యేలా రాజ్యాంగ రక్షణ కల్పించాలని కూడ ఆయన ప్రతిపాదించాడు. విద్యారంగంలో కూడ 27 శాతం రిజర్వేషన్‌ను అమలుచేయాలని, వెనుకబడిన కులాల విద్యార్థులు పెరిగే సాంస్కృతిక వాతావరణాన్ని మెరుగుపరిచేందుకుగాని, మెరుగైన వాతావరణాన్ని రూపొందించేందుకుగాని తక్షణమే సాధ్యంకాదు గనుక రిజర్వేషన్ల అమలు తప్పనిసరి అని ఆయన వాదించాడు. ఉచిత భోజన వసతులతో రెసిడెన్షియల్ పాఠశాలలు, ప్రత్యేక ప్రభుత్వ హాస్టళ్ళు, వయోజన విద్యా కేంద్రాలు, వృత్తి విద్యా సౌకర్యాలు మొదలయిన వసతులు కల్పించాలని కూడ ఆయన సూచించాడు.

ఈ ఉద్యోగ, విద్యారంగాల కన్న ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల వెనుకబడిన కులాల అభివృద్ధికోసం మండల్ కొన్ని సూచనలు చేశాడు. కుల వృత్తిని కొనసాగించే వారికి ఆర్థిక సహాయం అందించే బాధ్యతను ప్రభుత్వం చేపట్టాలని, అందుకోసం ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలలోలాగ వెనుకబడిన కులాల ఆర్థిక సహాయ కార్పొరేషన్‌లను నెలకొల్పాలని ఆయన అన్నాడు. చేతివృత్తులవారి సహకార సంఘాలను ప్రోత్సహించాలని, ఆ సంఘాలలో ఆయా వృత్తులవారే ఉండేలా జాగ్రత్త వహించాలని ఆయన సూచించాడు. వెనుకబడిన కులాలకు చెందిన వ్యక్తులు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రభుత్వం సాంకేతిక, ఆర్థిక సహాయం అందించాలని అన్నాడు.

భూసంస్కరణలను అమలుజరపకుండా, ఉత్పత్తి సంబంధాలను మార్చకుండా, వ్యవస్థ మారకుండా వెనుకబడిన కులాల పరాధీనత అంతం కాదనే విషయాన్ని కూడ మండల్ గుర్తించాడు. భూసంస్కరణల విషయంలో ఇంతవరకూ ఏ ప్రయత్నమూ చిత్తశుద్ధితో జరగలేదని కూడ గుర్తించాడు. ఉత్పత్తి సంబంధాల

మార్పు పారిశ్రామిక రంగంలో సాధ్యం కాకపోయినా వ్యవసాయ రంగంలో సాధ్యమేనని ఒక విచిత్రమైన వాదనచేసి ఆ మార్పుకూడ ప్రజా చైతన్యంవల్ల కాక ప్రభుత్వ సంస్కరణవల్ల వస్తుందని భావించి ఆ మేరకు సూచన చేశాడు.

ఈ సూచనలన్నీ అమలుచేసి ఇరవై సంవత్సరాల తర్వాత సమీక్షిస్తే అప్పటికి ఈ సంస్కరణలవల్ల ఒక తరం చైతన్యం ప్రభావితమవుతుందని, ఫలితాలు రుజువవుతాయని ఆయన అన్నాడు. పది సంవత్సరాలు గడిచినాక ఒకే ఒక్క సూచనలో పావువంతు అమలుచేయాలని నిర్ణయం తీసుకుని ఆ నిర్ణయాన్ని తూట్లు పొడిచేందుకు ఆలోచిస్తున్నాయి పాలకవర్గాలు.

అసలు ఈ రిజర్వేషన్‌లు ఎందుకు, ఎట్లా ప్రారంభమయ్యాయి ?

1858 కి ముందు ఈస్టిండియా కంపెనీ ఆధ్వర్యంలో నడిచే విద్యా సంస్థలలో అస్పృశ్యుల పిల్లలకు ప్రవేశం ఉండేది కాదు. అసలు మొత్తం మీదనే విద్యా సంస్థలు తక్కువయిన ఆ రోజులలో, కుల వ్యవస్థ పట్టుబలంగా ఉండిన ఆ రోజులలో యిది ఆశ్చర్యమేమీ కాదు. శూద్రకులాల పిల్లలకు కూడ సూటిగా నిరాకరణ లేకపోయినా వాళ్ళు చదువుకోగలిగిన అవకాశాలే తక్కువ. 1858 లో ఈస్టిండియా కంపెనీనుంచి బ్రిటిష్ మహారాణికి భారత పాలనాధికారం దఖలుపడిం తర్వాత బ్రిటిష్ ప్రభుత్వం తన పాఠశాలల్లో వివక్షను తొలగించింది. కాని అగ్ర వర్ణాలు ఆ పాఠశాలల్లో చేరడానికి తిరస్కరించాయి.

అప్పటి నుంచి విద్యారంగంలో అప్పటికే ఆధిపత్యం నిర్వహిస్తున్న అగ్ర వర్ణాలకూ, ముఖ్యంగా బ్రాహ్మణులకూ మిగిలిన అన్ని వెనుకబడిన వర్గాలకూ మధ్య ఘర్షణ ప్రారంభమైంది. ఆ తర్వాత కాలమంతా కొన్ని కులాలు పైకి ఎదిగి అగ్ర వర్ణ భావజాలానికి లోబడిపోవడం, ఇంకా ఇంకా ఎక్కువ కులాలు ఆర్థిక సంక్షోభం బారినపడి వెనుకబడిన కులాలుగా మారిపోవడం సాగుతూ వస్తోంది.

1885లో మద్రాసు ప్రభుత్వం అణచబడిన కులాలకు కొన్ని ప్రత్యేక సౌకర్యాలను కల్పించింది. 1921లో మద్రాసు ప్రభుత్వమే ప్రభుత్వోద్యోగాలలో బ్రాహ్మణేతరుల ప్రాధాన్యాన్ని పెంచడానికి చర్యలు తీసుకుంది. 1927లో ప్రకటిం

చిన విధానం 'కమ్యూనల్ ఆర్డర్' పేరుతో ఈ పద్ధతిని స్థిరీకరించింది. జనాభాను ఐదు తరగతులుగా విభజించి ఉద్యోగాలలో ఏ తరగతికి ఎంత ప్రాతినిధ్యం ఉండాలో నిర్దేశించింది.

ఇంతకన్న కొద్ది ముందే మాంటేగ్-ఛెమ్స్‌ఫర్డ్ సంస్కరణలలో దేశంలో కొన్ని ప్రజా సమూహాలు తరతరాలుగా అణచివేతకు గురయ్యాయని, వాటికి రక్షణ కల్పించే చర్యలు తీసుకోవాలనీ సూచించారు. తద్వారా దేశవ్యాప్తంగా అమలు కావడం ప్రారంభమైన రిజర్వేషన్లు అస్పృశ్య కులాలకు మాత్రమే కాక ముస్లింలకు, సిక్కులకు, క్రిస్టియన్లకు కూడ వర్తించేవి. అప్పటికి ఆదివాసులకు రిజర్వేషన్లు లేవు. 1935 భారత ప్రభుత్వ చట్టంలో ఈ రిజర్వేషన్లను 'సాంఘికంగా వెనుకబడిన వర్గాల'కు కల్పిస్తున్నట్లు ప్రకటించారు.

అధికార మార్పిడి జరిగిన తర్వాత ఈ రిజర్వేషన్ల సమస్య మళ్ళీ చర్చలోకి వచ్చింది. రాజ్యాంగ నిర్ణయసభలో చర్చోపచర్చలు జరిగాయి. చివరికి రాజ్యాంగంలో నాలుగు అధికరణాలు స్పష్టాస్పష్టంగా ఈ సమస్యను గుర్తించాయి.

మతం, తెగ, కులం, స్త్రీ పురుష భేదం, జన్మస్థలం వంటి కారణాలమీద వివక్షను నిషేధించే 15వ అధికరణంలో ఒక నిబంధనగా "సాంఘికంగా, విద్యా పరంగా వెనుకబడిన వర్గాల పౌరుల అభ్యున్నతికిగాని, షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల అభ్యున్నతికిగానీ ప్రత్యేక సౌకర్యాలను కల్పించడానికి ప్రభుత్వానికి ఈ నిషేధం ఆటంకంకాదు" అని చెప్పారు.

ప్రభుత్వ ఉద్యోగాలలో సమాన అవకాశాలను నిర్ధారించే 16వ అధికరణంలో ఒక నిబంధనగా "ప్రభుత్వ ఉద్యోగాలలో తగినంత ప్రాతినిధ్యం లభించలేదని ప్రభుత్వం భావించే ఏ వెనుకబడిన వర్గపు పౌరులకయినా ఉద్యోగాలలో, నియామకాలలో రిజర్వేషన్ కల్పించడానికి ప్రభుత్వానికి ఈ నిర్దేశం అడ్డంకి కాదు" అని చేర్చారు.

ఆదేశిక సూత్రాలలో భాగమైన 46వ అధికరణంలో "బలహీన వర్గాల ప్రజల, ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల ప్రజల విద్యా, ఆర్థిక ప్రయోజనాలను ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి చేస్తుంది. వారిని సాంఘిక అన్యాయం నుంచీ, అన్నిరకాల దోపిడీల నుంచీ పరిరక్షిస్తుంది" అని రాశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలలో షెడ్యూల్డ్ కులాల, తెగల అభ్యర్థుల కోర్కెలను పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందని 335వ అధికరణంలో రాశారు.

రాజ్యాంగ రచన నాటికే అస్పృశ్య కులాలను షెడ్యూల్డ్ కులాలుగా, ఆదివాసులను షెడ్యూల్డ్ తెగలుగా వర్ణించడంతో కొంత స్పష్టత అయినా వచ్చిందిగాని ఆ మాటతోపాటే వాడిన 'విద్యాపరంగా, సాంఘికంగా వెనుకబడిన వర్గాలు', 'బలహీన వర్గాలు' అంటే ఎవరనే వివాదం ఈ నాలుగు దశాబ్దాలుగా సాగుతూనే ఉంది. వెనుకబడిన వర్గాలను నిర్ణయించేందుకు 1955లో ప్రభుత్వం మొదటి కమిషన్‌ను నియమించింది. జనాభాలోని ఏ వర్గాలను సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబడినవిగా గుర్తించాలో నిర్ణయించడం ఈ కమిషన్ పని. ఈ కమిషన్ సభ్యులలో అధిక సంఖ్యాకులు వెనుకబాటుతనానికి ప్రమాణం కులం అని గుర్తించారు. అందువల్ల దేశవ్యాప్తంగా 2399 కులాలను వెనుకబడినవిగా గుర్తించి, ఆ కులాలవారికి కూడ షెడ్యూల్డ్ కులాలకూ, షెడ్యూల్డ్ తెగలకూ అందుతున్న లాంటి సౌకర్యాలు అందించాలని కోరారు.

అయితే ఈ కమిషన్ నివేదిక విషయంలో ఒక విచిత్రం జరిగింది. మొదటి నుంచీ మెజారిటీ నిర్ధారణలతో ఏకీభవిస్తూ వచ్చిన కమిషన్ అధ్యక్షుడు కాకా కాలేల్కర్ నివేదిక సమర్పించబోయే ముందు తన అభిప్రాయాలు మార్చుకున్నాడు. నివేదికను రాష్ట్రపతికి సమర్పిస్తూ రాసిన లేఖలో ఆయన తన కమిషన్ చేసిన నిర్ధారణలన్నిటినీ ఖండించాడు. తాము సూచించిన పరిష్కారాలు తాము ఎదుర్కొన్న సమస్య కంటె ఘోరమైనవని అన్నాడు. ప్రజాస్వామ్యమంటే వ్యక్తి నిష్ఠమైనదనీ, కుటుంబాన్నో, కులాన్నో ప్రమాణంగా తీసుకోవడం ప్రజాస్వామిక స్వభావానికే విరుద్ధమని అన్నాడు. కమిషన్ సిఫారసు చేసిన రిజర్వేషన్‌లను ఆయన వ్యతిరేకించాడు.

ప్రభుత్వం కూడ కమిషన్ సిఫారసులను తిరస్కరించింది. ఐదు సంవత్సరాల తర్వాత కేంద్ర హోం మంత్రిత్వశాఖ రాష్ట్ర ప్రభుత్వాలకు ఒక లేఖ రాస్తూ కుల ప్రమాణాన్ని వదిలేసి, ఆదాయ ప్రమాణాన్ని అనుసరించమని సలహా ఇచ్చింది. ఆ తర్వాత విడివిడిగా రాష్ట్రాలు తమ స్వంత ప్రమాణాల్ని అనుసరించి

వెనుకబడిన కులాల్ని నిర్ధారించి రిజర్వేషన్లను అమలు చేయడం ప్రారంభించాయి. ఆంధ్రప్రదేశ్, బీహార్, జమ్ముకాశ్మీర్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వాలు విడివిడిగా కమిషన్లను నియమించాయి. ఆ కమిషన్ల సిఫారసులలో కొన్నిటిని అమలుచేశాయి. మొత్తంమీద దేశవ్యాప్తంగా షెడ్యూల్డ్ కులాలకు, షెడ్యూల్డ్ తెగలకు మినహా మరే వర్గానికీ ఒకే రకమైన రిజర్వేషన్ లేకుండా పోయింది.

బాలాజీ వర్సస్ స్టేట్ ఆఫ్ మైసూర్ అనే కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇస్తూ రిజర్వేషన్లు 50 శాతానికి మించగూడదని ప్రకటించింది. జనాభా ఆధారంగా షెడ్యూల్డ్ కులాలకు 15 శాతం, షెడ్యూల్డ్ తెగలకు 7.5 శాతం రిజర్వేషన్లు పోగా ఈ పరిమితికి లోబడి ఉండాలంటే ఇంకా 27.5 శాతం రిజర్వేషన్ మాత్రమే మిగులుతుంది. దీనిలో నుంచే మండల్ వెనుకబడిన కులాలకు 27 శాతం రిజర్వేషన్ ఉండాలని సూచించాడు.

నిజానికి జనాభా ప్రాతిపదికగా రిజర్వేషన్ సూత్రాన్ని పాటిస్తే వెనుకబడిన కులాల జనాభా దేశ జనాభాలో 52 శాతం. కూలీలుగా, శ్రామికులుగా, చేతివృత్తుల వాళ్ళుగా, సమాజానికి అవసరమైన సేవలందించే వాళ్ళుగా, రైతులుగా ఈ వెనుకబడిన కులాలవాళ్ళే తరతరాలుగా మన సమాజ మనుగడకూ, అభివృద్ధికీ ఆధారం. ఈ కులాలన్నిటినీ వర్ణవ్యవస్థలో నాలుగోవర్ణంగా, శూద్రులుగా లెక్కించారు. శూద్రులు బ్రహ్మ పాదాల నుంచి పుట్టారని పురుష సూక్తంలో రాశారు. హిందూ పురాణాలలోను, స్మృతులలోను శూద్రకులాలను, అసలు మొత్తంగా శారీరక శ్రమను చిన్నచూపు చూసే భావజాలాన్ని వ్యాపింపజేశారు.

అన్ని వర్గ సమాజాలలోను అన్ని నాగరికతలలోను ఇటువంటి పరిణామం ఉంది. పీడకవర్గం అన్ని చోట్లా శారీరక శ్రమను చిన్నచూపు చూసి మేధో సామర్థ్యాన్ని ప్రధానమైనదిగా చెప్పే భావజాలాన్ని వ్యాప్తిలోకి తెచ్చింది. నిజానికి గ్రీకు, రోమన్, ఈజిప్షియన్, మొహంజోదారో నాగరికతలన్నిటిలోనూ చేతివృత్తుల, వ్యవసాయదారుల నైపుణ్యం ఎంతగా వికసించి ఆ సమాజాలను నాగరికతవైపు నడిపించిందో కనబడుతుంది. కాని ఎవరి శ్రమమీద ఆధారపడి ఆయా సమాజాలు ఇంత ప్రగతిని సాధించాయో ఆ శ్రామికులను బానిసలుగా, రెండో స్థాయి పౌరులుగా, దళితులుగా చూడడం జరిగింది.

భారతదేశంలో ఈ అంతరాల వ్యవస్థకే కులం అని పేరు వచ్చింది. కులాన్ని మతం, ఇతిహాసాలు, పురాణాలు, స్మృతులు పటిష్టం చేశాయి. ఇతిహాసాలలో సాంఘిక చరిత్ర శకలాలు ఉన్నాయని అనుకుంటే ఏకలవ్యుడికి విలువిద్య నేర్పక పోవడంలో, ఏకలవ్యుడే స్వయంగా విద్య నేర్చుకుంటే భావజాలం సాయంతో ఆ విద్య పనికిరాకుండా చేయడంలో ద్రోణాచార్యుడు అనుసరించిన కుటిలనీతి తెలిసిందే. శ్రీరామచంద్రుడు ఎన్ని కులాలవాళ్ళని, ఎన్ని తెగలవాళ్ళని అణచివేశాడో, మాయ మాటలతో లొంగదీసుకున్నాడో రామాయణం తెలుపుతుంది శూద్రుడై కూడ విద్య నేర్చుకున్నాడని, ఆశ్రమం నిర్మించి తపస్సు చేశాడని, విద్యా బోధన చేశాడని శంబూకుణ్ని వధించిన గాథ సుప్రసిద్ధమైనదే. ఇవన్నీ విడివిడి సంఘటనలు కాగా, చాలా స్పష్టంగానే శూద్రులు వేదాలు నేర్చుకోవడానికి అనర్హులనీ, శూద్రులు వేదాలు నేర్చుకున్నట్టయితే సీసం కరిగించి చెవుల్లో పోయాలనీ నిర్దేశించారు.

సమాజానికి అవసరమైన శ్రమ అంతా చేస్తూ కూడ ఆ శ్రమకు తగిన ఫలితాన్ని పొందక పోవడం వల్ల, భావజాలంలో, సంస్కృతిలో చిన్నచూపు చూసే భావాలు ప్రచారమైనందువల్ల శూద్రకులాలు వెనుకబాటుతనంలో ఉండిపోయాయి. ఆర్థికంగా, సాంస్కృతికంగా సాగిన ఈ అణచివేత సమాజ అంతరాల వ్యవస్థలో వెనుకబడిన కులాల స్థానాన్ని స్థిరపరిచింది. ఈ స్థానం నుంచి పైకి ఎదిగేందుకు ఒక సాధనమైన విద్య, ఉద్యోగ రంగాలలోకి వాళ్ళు ప్రవేశించకుండా ఈ భావజాలమే అడ్డుకుంది.

వలస పాలకులు భారతదేశంలో ప్రవేశించిన తర్వాత వెనుకబడిన కులాలలోని చేతివృత్తుల వాళ్ళ జీవన స్థితిగతులు ఘోరంగా చితికిపోయాయి. పారిశ్రామిక ఉత్పత్తులు అమ్ముకోవడం కోసం బ్రిటిష్ పాలకులు చేతివృత్తులను నాశనం చేశారు. బెంగాల్ సాలెవాళ్ళ వేళ్ళు నరికిన ఉదంతం దగ్గరినుంచి మార్కెట్లను పారిశ్రామిక వస్తువులతో నింపేసి, చేతివృత్తులమీద ఆంక్షలు విధించి అనేక రకాలుగా బ్రిటిష్ పాలకులు వెనుకబడిన కులాల స్థితిని మరింత దుర్భరంగా మార్చారు బ్రిటిష్‌వారి ప్రవేశానికి పూర్వం పారిశ్రామికంగా (చేతివృత్తులలో) అభివృద్ధి చెందిన ఎన్నో ప్రాంతాలు ఆ తర్వాత కరువు కాటకాలకు నిలయాలయ్యాయి.

తరతరాలుగా ఈ రకంగా ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక స్థాయిలలో అమలయిన అణచివేతను, సమాన అవకాశాల నిరాకరణను తొలగించే క్రమంలో

రిజర్వేషన్లు ఒక మెట్టు. రిజర్వేషన్ల గురించి ప్రధానంగా మూడు వైఖరులు వ్యక్తమవుతున్నాయి. రిజర్వేషన్లు ఎంత మాత్రం అమలు చేయగూడదనే వైఖరి ఒక కొసన ఉండగా, రిజర్వేషన్లే ముక్తిమార్గమన్నట్టుగా, రిజర్వేషన్లే సర్వస్వమనే వైఖరి మరో కొసన ఉంది. మధ్యేమార్గంగా మొదలయిన రిజర్వేషన్‌లు ఉండాలి గాని ఆర్థిక ప్రాతిపదికమీద ఉండాలనే వైఖరి ఇప్పుడు ప్రబలమవుతోంది. రిజర్వేషన్ వ్యతిరేకులు ఇప్పుడు ఈ వైఖరి కింద తలదాచుకుంటున్నారు.

రిజర్వేషన్ వ్యతిరేకులు చేసే వాదనలలో ప్రధానమైనది ప్రతిభ, సామర్థ్యం రిజర్వేషన్లవల్ల లోపిస్తాయనేది. ఈ వాదనను ప్రారంభించినదీ, కొనసాగిస్తున్నదీ అగ్రవర్ణ సిద్ధాంతవేత్తలే. ఈ వాదన వెనుక ప్రతిభ తమకు మాత్రమే ఉన్నదనే, ఉంటుందనే దురంహకారం ఉన్నది. ప్రతిభ గురించి సమగ్ర చారిత్రక దృక్పథం లేకపోవడం ఉన్నది.

ప్రతిభ, సామర్థ్యం అనేది అగ్రవర్ణాల గుత్తసొమ్ముకాదు. అగ్రవర్ణాలు వేల సంవత్సరాలుగా అమలు చేస్తూ వచ్చిన పీడనవల్ల, సమాజంలో ఇతరవర్గాలకు లేని ఎన్నో అవకాశాలు అగ్రవర్ణాల చేతికందాయి. ఆ అవకాశాల సాయంతో వాళ్ళకు సమాజ నిర్మాణంలో ఇంకా పైకి పోవడానికీ, ఇతరులతో సంబంధాలలో ఆత్మ విశ్వాసంతో, గర్వంతో ప్రవర్తించడానికీ వీలు కలిగింది. ఎన్నో తరాల కింద ప్రారంభమైన ఈ క్రమాన్నంతా విస్మరించి ఇవాల్టికివాళ ప్రతిభ, సామర్థ్యాల గురించి మాట్లాడడం హాస్యాస్పదమైన విషయం. వేల ఏళ్ళపాటు అవకాశాలు నిరాకరించబడిన వాళ్ళను, అవకాశాలు హక్కు భుక్తం చేసుకున్నవాళ్ళను సమానంగా ప్రతిభ పోటీలో నిలబెట్టడం అన్యాయం.

అసలింతకూ మౌలికమైన ప్రశ్నలోకి వెళ్తే ప్రతిభంటే ఏమిటి? ప్రతిభ, మేధోసామర్థ్యం అనేవి జన్యు సంబంధమైనవి కావని, పెంపకం, శిక్షణ, సంస్కృతి ప్రతిభను నిర్ణయిస్తాయని జీవ శాస్త్రమూ, సామాజిక శాస్త్రాలూ స్పష్టంగా రుజువు చేసి ఉన్నాయి. రిజర్వేషన్ వ్యతిరేకులు ప్రతిభ అన్నప్పుడల్లా వాళ్ళ మేధో సామర్థ్యాన్నే తప్ప శారీరక సామర్థ్యాన్ని సూచించడంలేదు. నిజానికి ఈ భావజాలం శారీరక శ్రమలో ప్రతిభ ఉన్నదని గుర్తించనే గుర్తించదు. ఏ చేతివృత్తిలోనయినా, వ్యవసాయంలోనయినా వ్యక్తమవుతున్న శారీరక శ్రమలో, ఆ క్రమంలో వెలువడు

తున్న సృజనాత్మకతలో ప్రతిభ ఉన్నదని గుర్తిస్తే నిజానికి సమాజాన్ని పోషిస్తున్న ప్రతిభ అస్పృశ్య కులాలలోను, ఆదివాసులలోను, వెనుకబడిన కులాలలోను మాత్రమే ఉన్నది.

అసలు ఏ జ్ఞానమైనా, సామర్థ్యమైనా ఆచరణ క్రమంలోనే మనుషులకు అందుతుంది. ప్రతిభ అనేది ఆ రకంగా సామాజికాచరణ ఉత్పత్తే తప్ప స్వయం సహజాతంకాదు. ఇవాళ తమకే ప్రతిభ ఉన్నదని చాటుకుంటున్న వర్గాలు సామాజి కాచరణ నుంచి దూరమై వందల ఏళ్ళయిపోయింది. ఆచరణతో సంబంధం లేకుండా, అందువల్ల సరైన జ్ఞానాన్ని పొందలేని వీళ్ళు మార్కులనే జ్ఞానంగా ప్రకటిస్తారు. ఆ మార్కులను కూడ అనేక రకాల తప్పుడు పద్ధతుల్లో సంపాదిస్తారు.

మేధోసామర్థ్యం, మానసిక శ్రమలను కూడ సమాజానికి అవసరమైన ప్రతిభగా గుర్తించాలంటే అవి సామాజిక పురోగమన సూత్రాలతో, శారీరక శ్రమతో సమన్వయంలో ఉండాలి. రిజర్వేషన్ వ్యతిరేకులు కోరుతున్న ప్రతిభ శారీరక శ్రమ తోనూ, సామాజిక పురోగమనంతోనూ సంబంధం లేనిది. పైకి చెప్పరు గాని అది దైవదత్తమైనదని వాళ్ళ విశ్వాసం. శారీరక శ్రమను చిన్నచూపు చూసే ఈ ప్రతిభ సహజంగానే సమాజ వ్యతిరేకంగా తయారవుతోంది. రిజర్వేషన్లు అమలు కాక ముందునుంచి ఇప్పటివరకు మన పాలకులుగా, సంస్కృతీ నిర్ణేతలుగా, ఆర్థిక వ్యవస్థ నిర్వాహకులుగా ఈ 'ప్రతిభా'వంతులే ఉంటున్నారు. ఈ ప్రతిభ మన సమాజాన్ని ఎంతగా దోపిడీ పీడనల మయం చేసిందో, సంక్షోభ పూరితం చేసిందో, అక్రమాలకు ఆలవాలం చేసిందో చూస్తూనే ఉన్నాం. (రిజర్వేషన్లు అతి ఎక్కువగా ఉన్న తమిళ నాడులో సాపేక్షికంగా సమర్థమైన పాలన ఉండగా, అతి తక్కువగా ఉన్న బీహార్‌లో ఎంత అవినీతి వ్యాపించి ఉన్నదో అందరికీ తెలుసు).

అంతేకాక ఈ 'ప్రతిభా'వంతుల వాదనలో అంతర్లీనంగా ఒక 'అభి వృద్ధి' దృక్పథం ఉన్నది. మార్కులనే ప్రతిభ అనుకున్నట్టుగానే భౌతిక సంపదనే అభివృద్ధిగా భావించడం ఉన్నది. మానవ సంబంధాలలో ఏ అభివృద్ధినీ తేని, భౌతిక సంపద పెరుగుదలనే అభివృద్ధిగా ఈ దృక్పథం చూస్తుంది. ప్రాపంచిక దృక్ప

ళంలో గాని, మానవ సంబంధాలలో గాని ఏ అభివృద్ధినీ సాధించలేని ఈ 'ప్రతిభా' దృక్పథం కేవలం ఉన్నత వర్గాల అత్యల్ప సంఖ్యాకులకు మాత్రమే అవకాశాలు కల్పిస్తుంది.

ఈ దృక్పథంలో అంతర్లీనంగా ఉన్న దురహంకారం ఫాసిజంతో, హిట్లర్ చెప్పిన లాంటి 'ఆర్యజాతి గొప్పతనం' తో సమానమైనది గనుక ఇది క్రమక్రమంగా అన్ని ప్రజావర్గాలపట్ల శత్రు వైఖరినే తీసుకుంటుంది. ఇవాళ రిజర్వేషన్ వ్యతిరేకులు తమ రాజకీయ ఎత్తుగడగా మధ్యతరగతిని, అగ్రవర్ణాలలో పేదలను రెచ్చగొడుతున్నారు గాని అంతిమంగా ఈ ఫాసిస్టు స్వభావంవల్ల వాళ్ళపట్ల గూడ శత్రు వైఖరినే ప్రదర్శిస్తారు.

కనుక చర్చ జరపవలసింది నిర్వికార ప్రతిభ గురించి కాదు. ప్రతిభను స్థల కాలాలతో, చారిత్రికతతో, సమాజ గతి సూత్రాలతో సమన్వయంతో మాత్రమే చూడ వలసి ఉంది. రిజర్వేషన్ వ్యతిరేకులు ప్రతిభ గురించి మాట్లాడినప్పుడల్లా ఈసమగ్ర దృక్పథం లోపిస్తుంది. ప్రతిభ గురించి మాట్లాడడం ద్వారా తమ వాదనకు చాల మందిని అనుకూలం చేసుకోవడమే రిజర్వేషన్ వ్యతిరేకుల లక్ష్యం.

రిజర్వేషన్లు అసమానతకు దారి తీస్తాయనీ, కులభేదాలను రెచ్చగొడతాయనీ, వ్యక్తిమీద ఆధారపడవలసిన సమాజాన్ని కులం మీద ఆధారపడేట్టు చేస్తాయనీ రిజర్వేషన్ వ్యతిరేకులు వాదిస్తున్నారు. సమాన అవకాశాలను కల్పించవలసిన వ్యవస్థలో కొందరికి ఈ సౌకర్యాలేమిటనీ, కులవివక్షను రద్దు చేస్తామని చెపుతూ ఈ కుల ప్రస్తావన ఏమిటనీ అమాయకంగా ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రశ్నల్లో న్యాయం ఉన్నట్టు కనిపించి చాలమంది ఈ వాదనల మాయలో పడిపోతున్నారు.

మొట్టమొదట గుర్తించవలసిన విషయం రిజర్వేషన్లకు ముందునుంచే మన సమాజంలో అసమానతలు ఉన్నాయి, కులాలున్నాయి, కులవిభేదాలు ఉన్నాయి. రిజర్వేషన్ల వల్ల అవి రాలేదు. రిజర్వేషన్లను అసమానతను పోగొట్టే ఒక సంస్కరణ సాధనంగానే, వెనుకబడిన వర్గాల అసంతృప్తిని తగ్గించే సేఫ్టీ వాల్వ్‌గానే పాలకులు ఉద్దేశించారు. ఆ ఉద్దేశించిన పనిని కూడ రిజర్వేషన్లు సక్రమంగా నెరవేర్చలేక పోయాయి. కనీసం సంఘసంస్కరణ కూడ కొనసాగించలేనంత పతనమైపోయిన పాలక వర్గాలు రిజర్వేషన్లను సక్రమంగా, చిత్తశుద్ధితో కొనసాగించ లేకపోయాయి.

రిజర్వేషన్లు అసమానతకు దారి తీస్తాయనేది హాస్యాస్పదమైన విషయం. అస మానంగా ఉన్న సమాజంలో, అసమానతకు మత, సాంస్కృతిక, ఆర్థిక సమర్థన ఉన్న సమాజంలో, ఆ అసమానతను ఎదుర్కొనేందుకు అసమాన అవకాశాలే కల్పించక తప్పదు. అసమాన స్థాయిలలో ఉన్నవాళ్ళకు సమాన అవకాశాలు కల్పిం చడం అసమానత మరింత పెరగడానికే దారితీస్తుంది.

ఈ అసమానతకూ, వెనుకబడిన తనానికీ కులమే ఒక ఆధారమూ, బలమూ అయినప్పుడు అసమానతను తొలగించే మార్గాలను కులంలో వెతకక తప్పదు. కుల వ్యవస్థ ఎందుకు ఎట్లా ఏర్పడినా అగ్రవర్ణాలు దాన్ని అసమానతను పెంచిపోషిం చేందుకే వాడుకుంటూ వస్తున్నారు. అందువల్ల సాధారణ అర్థంలో వెనుకబాటు తనానికి కులమే ప్రమాణమవుతుంది. వెనుకబాటుతనం నుంచి బైటపడేందుకు ఆయా కులాలు చేసిన పోరాటాల ఫలితంగా, వ్యక్తీకరించిన ఆకాంక్షల ఫలితంగానే రిజర్వేషన్ల రూపకల్పన జరిగింది. ఈ అన్ని కారణాలవల్ల రిజర్వేషన్ అనే అసమాన అవకాశాల విధానాన్ని, కులం ప్రాతిపదిక మీదనే కల్పించక తప్పదు.

అయితే ఈ వెనుకబడిన కులాలలో ఆర్థికంగా వెసులుబాటు సాధించిన కులాలు లేవా, కనీసం వ్యక్తులు లేరా, వాళ్ళకు రిజర్వేషన్ కల్పించడం ఎందుకు అని మరొక ప్రశ్న వస్తుంది. కాలేల్కర్ కమిషన్ గుర్తించిన 2399 కులాల లోను, మండల్ గుర్తించిన 3743 కులాలలోను వెనుకబాటుతనం నుంచి పూర్తిగా బయటపడిన కులాలెన్ని? కొందరు వ్యక్తులో, ఒక కులం మొత్తంగానో ఆర్థిక వెసులుబాటు సాధించి ఉండవచ్చు గాని వెనుకబాటు తనం పోయిందని చెప్పడానికి అది సూచిక అవుతుందా? శూద్రకులాల వెనుకబాటుతనంలో ఆర్థిక వనరులు లేక పోవడం ఒక అంశం మాత్రమే. సామాజికంగా, సాంస్కృతికంగా చిన్నచూపు చూడబడడం, నిందలకూ అవమానాలకూ గురికావడం, ఏన్యాయపరంగా అవకాశాలు లేకపోవడం వంటి ఇతర చిహ్నాలు ఆర్థిక వెసులుబాటుతో కూడ తీరడం లేదు. పారిశుధ్య పని చేసే అస్పృశ్య కులాలు, మురికి గుడ్డలు ఉతకడం, క్షౌరం చేయడం వంటి నిత్య జీవితావసర పనులు చేసే కులాలు, ఎంతో అవసరమైన పనులు చేస్తూ కూడ చిన్నచూపు చూడబడుతున్నాయి. ఈ వృత్తుల మీద సామాజిక అవమానపు

ముద్ర ఉన్నది. ఆయా కులాల వ్యక్తులు ఆర్థికంగా మెరుగైన స్థితిలోకి వచ్చినా, ఆముద్ర పోవడంలేదు. ఇతర కులాల వ్యక్తులు ఎంత దారిద్ర్యంలో ఉన్నా ఈవృత్తుల్ని చేపట్టడం లేదు. వీటిని బట్టి తేలేదేమంటే ఇవాల్టికీ మన సమాజం కాలే ల్కార్ భావించినట్లు వ్యక్తి నిష్టం కాలేదు. ఆ వ్యక్తి పుట్టిన కులం, ఆ కులానికి సామాజికంగా ఉన్న గుర్తింపు- అవమానంగానీ, గౌరవంగానీ - ఇంకా ఎక్కువ ప్రభావాన్ని చూపుతున్నాయి. కనుక విడిగా కొన్నికులాలు పైకి ఎదిగి వచ్చినా, కొందరు వ్యక్తులు పైకి ఎదిగి వచ్చినా ఈ సామాజిక గుర్తింపు పూర్తిగా తుడిచి పెట్టుకుపోవడం లేదు. అలా ఎదిగివచ్చిన కులాల సంఖ్యా, వ్యక్తుల సంఖ్యా కూడ ఏమంత ఎక్కువ కాదు.

ఈ పరిస్థితులలో మన ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండానే కుల ప్రాతిపదిక మీద రిజర్వేషన్లు తప్పవు. ఆర్థిక ప్రాతిపదికమీద, ఆదాయం ఆధారంగా ప్రత్యేక సౌకర్యాలను కల్పించాలనే ఆలోచనను మొదట కాలేల్కార్ ప్రతిపాదించాడు. 1955 నాటి లెక్కల ప్రకారం వార్షికాదాయం 800 రూపాయలకు తక్కువగా ఉన్నవారందరికీ సౌకర్యాలు కల్పించాలని ఆయన అన్నాడు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఈ ఆదాయ ప్రాతిపదికను పునాదిగాఉంచాలని ఎందరో వాదిస్తున్నారు. దేశంలో ఎనభై శాతం మంది అసంఘటిత రంగాలలోను, వ్యవసాయ రంగంలోను ఉండి, ఆ రంగాలలో స్పష్టమైన ఆదాయపు లెక్కలు లేనప్పుడు ఆదాయ ప్రమాణం అర్థరహితమై పోతుంది. ఉద్యోగవర్గాలు, సంఘటిత పారిశ్రామిక రంగంలో కార్మికులు మాత్రమే కచ్చితమైన వార్షికాదాయాన్ని ప్రకటించగలరు. మిగిలినవారిలో అత్యధిక సంఖ్యాకులు దారిద్ర్యరేఖకు దిగువనే ఉన్నారు. ప్రత్యేక సౌకర్యాలు అవసరమైన స్థితిలోనే ఉన్నారు. అయితే వారిని నమోదు చేయడం అసాధ్యమైన విషయం. భూస్వాములు, గ్రామీణ పెత్తందార్లు అసలు ఆదాయమే లేదని దొంగ పత్రాలు పుట్టించగలరు. న్యాయంగా సౌకర్యాలు అందవలసిన అగ్రవర్ణాలలోని అతి తక్కువ పేదవారికోసం ఈ నిబంధన విధిస్తే అది దుర్వినియోగమై పోవడానికే ఎక్కువ అవకాశం ఉంది. కులం ప్రాతిపదికగా ఉన్నప్పుడు ఆ యా కులాలలో ఆర్థికాభివృద్ధి సాధించినవాళ్లే ఆ అవకాశాలు పొందుతారనే మాట నిజమేగాని, ఒక స్థాయిలో అది అనివార్యమవుతుంది. మరో స్థాయిలో ఆర్థికాభివృద్ధికూడ సామాజిక స్థాయి అభివృద్ధి కావాలదని గుర్తించాలి.

ఇంతకూ ఇప్పుడు హఠాత్తుగా ఆర్థిక ప్రాతిపదిక మాత్రమే ఉన్నదని, సమాజంలో పేదలు, ధనికులు అనే రెండు వర్గాలే తప్ప కులాలకు ప్రాధాన్యత లేదని వాదిస్తున్నవాళ్ళు అనేక సంవత్సరాలుగా మార్క్సిస్టు వర్గ విభజనను వేళాకోళం చేస్తూ వచ్చిన వాళ్లే! మార్క్సిస్టు వర్గ విభజన భారతీయ ప్రత్యేకతలను గుర్తించదని అన్న వాళ్లే ఇప్పుడు భారతీయ సమాజాన్ని రెండు బృందాలుగా విడగొట్టడానికి ప్రయత్నిస్తున్నారు. అయితే మార్క్సిస్టు వర్గ విభజనలో పేద, ధనిక వ్యత్యాసం మాత్రమే ప్రధానం కాదు. ఉత్పత్తి సాధనాలమీద యాజమాన్యం ఉన్న వర్గం, ఉత్పత్తి సాధనాలు లేక శ్రమశక్తిమీదనే ఆధారపడేవర్గం అనేదే మార్క్సిస్టు విభజనకు పునాది. ఈ అర్థంలో భారతదేశంలో ఎన్ని విభేదాలున్నా, ఎన్ని జాతులున్నా, ఎన్ని భాషలున్నా ఉత్పత్తి సాధనాలమీద యాజమాన్యంగల వర్గాలు అగ్రవర్ణాలుగా, ఉత్పత్తి సాధనాల మీద యాజమాన్యం లేని వర్గాలు శూద్ర, అస్పృశ్య కులాలుగా, గిరిజన తెగలుగా ఉన్న దృశ్యం కనబడుతుంది. ఈ స్థితిని మతం స్థిరీకరించింది. గత నాలుగు దశాబ్దాల ఆర్థిక విధానాలు ఈ స్థితినే బలపరిచాయి.

ప్రత్యేక సౌకర్యాల కల్పన కోసం ఆర్థిక స్థితిని, ఆదాయాన్ని ప్రాతిపదికగా తీసుకోవాలనే వాదనలో దానికదిగా తప్పులేదుగాని ఈ చారిత్రక గమనాన్ని దృష్టిలో ఉంచుకుంటే ఆ ప్రాతిపదిక ఇప్పటికిప్పుడు సాధ్యం కాదని గుర్తించవచ్చు.

నిజానికి రిజర్వేషన్ సమస్య మీద ఇంత గందరగోళం చెలరేగడానికి కారణం మన సమాజం ఎదుర్కొంటున్న ఆర్థిక రాజకీయ సంక్షోభమే. పాలక వర్గాల దగ్గర విద్యావంతులందరికీ ఉపాధి కల్పించే విధానాలు లేవు. నిరుద్యోగుల సంఖ్య ఏటేటా లక్షలాదిగా పెరిగిపోతోంది. ఈ నిరుద్యోగ సైన్యాన్ని ఏదో ఒక ఆందోళనతో నిలిపి ఉంచుకోకపోతే, తప్పుడు రాజకీయాలు నేర్పకపోతే వాళ్ళ ఆకాంక్షలు ప్రజారాజకీయాలలో కలిసిపోతాయేమోనని పాలకులకు భయం. ఈ స్థితి నుంచి బైటపడేందుకు ఏదో ఒక బూచిని తయారుచేయాలి. అందుకే ఒక పాలక వర్గ ముఠా రిజర్వేషన్‌ను ప్రకటిస్తుంది. కొన్ని పాలకవర్గ ముఠాలు ఆ రిజర్వేషన్‌ను వ్యతిరేకిస్తూ ఆందోళన నడుపుతాయి.

కొన్ని వందల ఉద్యోగాలకు వేలమందీ, లక్షల మందీ అభ్యర్థులు ఉంటున్నప్పుడు, కొన్ని వందల సీట్ల చదువులకు లక్షల మంది అభ్యర్థులు ఉంటున్నప్పుడు

రిజర్వేషన్ వేసే ప్రభావం చాలా తక్కువ. ఒక్క ఉదాహరణ ఇవ్వాలంటే మన రాష్ట్రంలో ఇంజనీరింగ్, మెడిసిన్ ఎంట్రెన్స్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల సంఖ్య తొంభై వేల నుంచి లక్షవరకు ఉంటుంది. ప్రైవేటు కాలేజీలతో సహా మొత్తం సీట్లు ఆరువేల ఐదు వందలు. అంటే రిజర్వేషన్ ఉన్నా లేకపోయినా ఎనభై నాలుగువేల మంది అభ్యర్థులు కోరుకున్న చదువు చదవలేరు. అన్ని రిజర్వేషన్లు కలిపితే మరొక మూడువేల మంది ఈ జాబితాలో చేరతారంటే దాని ప్రాధాన్యం ఎంత తక్కువో అర్థం చేసుకోవచ్చు.

రాజ్య విధానాన్ని వ్యక్తి ఆధారంగా నిర్ణయించాలిగాని, కులం ఆధారంగా నిర్ణయించడం తప్పని, రిజర్వేషన్లు సామాజిక నిర్మాణాన్ని భగ్నం చేస్తాయని, జాతీయ సమగ్రతను దెబ్బతీస్తాయని, మండల్ నివేదికలో కొన్ని తప్పులు దొర్లాయని, మండల్ నివేదికను సామాజిక, ఆర్థిక శాస్త్రవేత్తలు తిరస్కరించారనీ, మండల్ జాబితాకూ, రాష్ట్రాల జాబితాకూ వ్యత్యాసాలున్నాయని రిజర్వేషన్ వ్యతిరేకులు అనేక వాదనలు ముందుకు తెస్తున్నారు.

ఒకవేళ ఈ వాదనలన్నీ నిజమే అయినా రిజర్వేషన్ విధానంలో మార్పులే అవసరమవుతాయిగాని దాన్ని మొత్తంగా రద్దు చేసుకోవలసి ఉండదు. అయితే ఈ వాదనలలో కొన్ని అబద్ధాలు, కొన్ని అర్థసత్యాలు, కొన్ని అతిశయోక్తులు కూడ ఉన్నాయి.

రిజర్వేషన్లు వెనుకబడిన కులాలకు కల్పించే విషయమై ఇంత వ్యతిరేకత వస్తున్నది గాని నిజానికి రిజర్వేషన్లను మైనారిటీలకు కూడ కల్పించవలసి ఉన్నది. సమాజంలో చారిత్రకంగా అవకాశాల నిరాకరణకు, అణచివేతకు, దోపిడీకి గురయిన అన్ని వర్గాలకు రిజర్వేషన్లు కల్పించవలసిందే. నిజానికి ప్రాంతాల మధ్య కూడ అటువంటి అసమానత తరతరాలుగా అమలయిందని, కనుక కొన్ని ప్రాంతాలకు అదనపు అవకాశాలివ్వాలని ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కాలంలో వాదించిన అగ్ర వర్ణాలే ఇవాళ వెనుకబడిన కులాల రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్నాయి. ప్రాంతం, కులం, మతం, స్త్రీ పురుష విభేదం వంటి ఏ రూపంలో అమలయిన అసమానతనైనా ఎదుర్కొనేందుకు వారికి అదనపు అవకాశాలు కల్పించడం ఒక మార్గం. గిరిజన ప్రాంతాలలో అమలయిన అసమానత మూలంగా వన్ ఆఫ్ సెవెంటీ నిబంధన వంటి రక్షణ నిబంధనలు వచ్చాయని గుర్తించాలి.

రిజర్వేషన్ వ్యతిరేక వాదనల చాటున అగ్రవర్ణ దురహంకారం చెలరేగు

తున్నప్పుడు, దానికి ప్రభుత్వ ప్రత్యక్ష. పరోక్ష మద్దతు ఉన్నప్పుడు రిజర్వేషన్‌ను పూర్తిగా సమర్థించక తప్పదు. కాని రిజర్వేషన్ విధానాన్ని ఇవాళ్టి చారిత్రక స్థితి వల్ల పూర్తిగా సమర్థిస్తున్నప్పటికీ, దానిలోని లోపాల్ని కూడ గుర్తించడం అవసరం.

రిజర్వేషన్లను ఎంత చిత్తశుద్ధితో, ఎంత సంపూర్ణంగా అమలు చేసినా అవి సామాజిక విప్లవాన్ని సాధించజాలవు. రిజర్వేషన్ల రూపకల్పనలోనే పాలితులలో ఒక వర్గంలో భ్రమలు రేపే, ఒక అనుకూలవర్గాన్ని తయారు చేసుకునే పాలకవర్గకుట్ర ఉన్నది. తమ అక్రమాల పట్ల వ్యక్తం కావలసిన ఆగ్రహాన్ని చల్లార్చే సేఫ్టీ వాల్వ్‌గానే పాలకులు ఈ విధానాన్ని రూపొందించారు. రిజర్వేషన్ విధానానికి ఉన్న ప్రజా వ్యతిరేక కోణం ఇది. ఈ కోణాన్ని గుర్తిస్తూనే, ప్రజా అనుకూల కోణాన్ని కూడ గుర్తించాలి. తరతరాలుగా అణచివేతకు గురయిన వర్గాలు తమ దుర్భర జీవితాన్ని మెరుగుపరచుకునేందుకు అనేక పోరాటాలు చేసిన ఫలితంగా, అనేక విధాల తమ ఆకాంక్షలు వ్యక్తం చేసిన ఫలితంగా ఒక హక్కుగా రిజర్వేషన్లు పొందారు. రిజర్వేషన్లు వారికి భిక్షగానో రాయితీగానో, ప్రభుత్వం నుంచి అందినవికావు. ఆ హక్కును వాళ్ళు ఏ స్థాయిలో వినియోగించుకోగలిగితే ఆ స్థాయిలో వాళ్ళలో ఆత్మ విశ్వాసం పెరుగుతుంది. తరతరాలుగా పేరుకుపోయిన న్యూనతాభావం చెరిగిపోతుంది.

అట్లాగే మన సమాజంలో కులానికీ వర్గానికీ మధ్య విభజన రేఖ చాల సన్ననిది గనుక కులపోరాటంలా పైకి కనబడుతున్న ఈ ఘర్షణ, వర్గపోరాటపు ఒకానొక వ్యక్తీకరణ అని గుర్తించవలసి వుంది. ఈ ఘర్షణలో వర్గపోరాటంగా ఎదగగలిగిన నిక్షిప్త శక్తులున్నాయని గ్రహించి ఆ శక్తుల్ని అభివృద్ధిచేయవలసి ఉంది.

ఈ రకంగా రిజర్వేషన్ విధానానికి ఉన్నపరిమితుల్ని గుర్తించాలి, అవకాశాల్ని గుర్తించాలి. ప్రస్తుత పాలక పక్షం రాజకీయ ఎత్తుగడగానే రిజర్వేషన్ విధానాన్ని అమలు చేస్తున్నదనీ గుర్తించాలి. అలా అమలు చేయక తప్పని స్థితిని ప్రజా ఉద్యమం సృష్టించిందనీ గుర్తించాలి. అంటే రిజర్వేషన్లు అంతిమ పరిష్కారం కాజాలవనే విషయాన్నీ, ప్రస్తుత స్థితిలో రిజర్వేషన్లు అనివార్యమనే విషయాన్నీ గుర్తించాలి. రిజర్వేషన్ వ్యతిరేకులలో అగ్రవర్ణ దురహంకారులకూ, అమాయకులకూ మధ్య తేడా గుర్తించి అగ్రవర్ణ దురహంకారాన్ని తీవ్రంగా ప్రతిఘటించాలి. అమాయకంగా రిజర్వేషన్ వ్యతిరేక వాదనలు చేస్తున్న వారికి వాస్తవాలు, మౌలిక అంశాలు వివరించాలి. రిజర్వేషన్‌కు అనుకూలంగా వాదిస్తున్న వారిలో రిజర్వేషన్ల పట్ల భ్రమలను తొలగించి, అంతిమ పరిష్కారం దిశగా వారిలో ఆలోచనలు రగిల్చాలి.

అదృశ్య యుద్ధగీతం

నరుడో భాస్కరుడు

దృశ్యం అదృశ్యం కాదు
దగ్గరితమౌతుంది
అడవి అదృశ్యం కానినాడు
ఆదివాసులు అదృశ్యంగా వున్ననాడు
మోగే తుడుం సజీవ శబ్దమే
భూమిని పంచమని అర్జీలు పెట్టుకున్న జనం
భూమిని దున్ని జైళ్ళకైనా పోతారు
నిర్బంధాలకు పోరాట ప్రతిధ్వనులిచ్చే
సభలకైనా వస్తారు
ఆరుచక్రాల లారీలాపితే - లక్షల కాళ్ళు
ఆశయాల్ని మోసుకుపోయే వాహనాలౌతాయి
తలలు పగిలినవాళ్ళు
        వాటిని పగలగొట్టడానికే సిద్ధపడతారు
పోటెత్తిన నదులముందు
పోలీసు బ్యారికేడ్లు వట్టి ఇసుక దిబ్బలే
లాఠీల వలలను ఛేదించుకొని
        నీళ్ళతో సహా చేపలా వస్తాయి
                దృశ్యమేదీ అదృశ్యం కాజాలదు
మాయమైనవాళ్ళ సాక్ష్యాల సుభాష్యాల్ని
తన్నుకుపోయే పీతిరి గద్దలున్నకాలం
వాటిని గురిచూసి పేల్చే వేటగాళ్ళూ ఉంటారు
జరగవలసిన ప్రతిదీ జరుగుతూనే ఉంటుంది
ప్రజలను కిడ్నాప్‌చేసే ప్రభుత్వాలున్నంతకాలం
వాటిని నిలవేసి నీళ్ళు తాగించే అన్నలూ వుంటారు
దిక్కులు మూసేస్తే ఊరేగింపు
కదం తొక్కుతున్న జనసేన అవుతుంది

పర్మిషన్ అక్కరలేదన్న బహిరంగసభ
పిన్ను తీసిన గ్రెనేడ్ అవుతుంది
పట్టికాళ్ళతో సద్దిమూటల్తో వచ్చినవాళ్ళు
సాయుధులై తిరిగి వస్తామని ప్రకటించి వెళ్ళారు
మారవలసిన ప్రతిదీ మారుతూనే వుంది
రేపటి దృశ్యం కాబోయే ప్రతిదీ నేటి వర్తమానమే
చిట్ట చివరకు
మొగలి పొదల మిన్నాగులు అదృశ్యం కావడం ఖాయం
హంతక వ్యవస్థల వ్యాసాంగాలే
అదృశ్యం కావడం ఖాయం.
(సెప్టెంబర్ పది తరువాత)

అమరుడు వీరన్నా!

ఫాలాంక్స్

సక్కనోడు వీరన్నా సుక్కల్లో కల్సిండు మాయన్న
ప్రాణాన్ని తృణప్రాయంచేసి, పోరాటానికి ఊపిరి పోసిన ॥సక్క॥

చిన్ని పాపల చూపులవాడు
పండు వెన్నెల నవ్వులవాడు
ప్రజల బ్రతుకులు తెల్సినవాడు
ప్రజలకోసమే బతికినవాడు
పోరాటంలో పోయేది లేదని
పోరుబాట నెరుపెక్కించినాడు ॥సక్క॥

తెలంగాణలో ఆదిలాబాదురా
పోరన్నలకే పుట్టినిల్లురా
నక్సల్‌బరికే వేసిన రెమ్మలు
బెల్లంపల్లి, మందమర్రిరా
మందమర్రిలో పుట్టినాడురా
మావో బాటన నడిచినాడురా
పేదల బతుకుల విముక్తికోసం

పేదల రాజ్యం స్థాపనకోసం
పోరు తప్ప మరి దారి లేదని
వారు బాటలో నడిచినాడురా ॥సక్క॥

సింగరేణిలో సితికిన బతుకులు
కార్మికుల కష్టాలు కడలిరా
బాధలతో త్రాగే తండ్రి
నీ తల్లిని కొట్టి, చెల్లెను తిట్టే
ఈ కుటుంబ కలతలు బాధలు, వ్యథలు
దోపిడి వ్యవస్థ భాగమన్నవు
ఈ వ్యవస్థ మార్పుకు మార్గం తెల్సి
అన్నల కల్సి ఆయుధమైన ॥సక్క॥

కంపెనీ దొరల దోపిడి కూల్చే
దొంగనాయకుల కుట్రలు చీల్చే
కార్మిక సమాఖ్య పిలుపునందుకుని
కొత్తగూడెం చేరుకున్నడు
శంకరన్న, షంషేర్‌ఖాన్‌ల
రవీందరన్నల కల్సుకున్నడు
రగల్ జెండలే గుండెకద్దుకుని
గుండుకు గుండె సూటిపెట్టిన ॥సక్క॥

వ్యాన్‌గాని పోలీసు మూకలు
మాటుగాసి మిము ఎత్తుకెళ్ళిరి
గుట్ట బోరుపై చెట్లకు కట్టి
అన్నల గుండెలు తూట్లు పొడిసిరి
మీ నెత్తుట తడిసిన ఎల్లందుగుట్టల
ఎరుపు మెరుపులు మేమౌతాము
మీ రక్తంలో తడిసిన ఎర్రజెండను
ఎర్రకోటపై ఎగరేస్తాము

[కామ్రేడ్ శంకర్ (సాగర్), కామ్రేడ్ షంషేర్‌ఖాన్, కామ్రేడ్ రవీందర్ రెడ్డి, కామ్రేడ్ వీరయ్య (శ్యాం) లను ఒక ద్రోహి ఇచ్చిన సమాచారం ప్రకారం ఆగష్టు 14, 1987న ఎల్లందు దగ్గర అడవిలో చెట్లకు కట్టి కాల్చి చంపారు.]

వీనాదేవి సంస్మరణలో :

పెట్టుబడి

వీనాదేవి

చేతిలో టెస్ట్‌ట్యూబ్ కిటికీవేపు తిప్పి చూశేడు మధుసూధన్. పచ్చటి యెండ పడి అందులోని ద్రవ్యం బంగారు నీరులా ఉంది. అంతవరకూ తన తలమీదున్న కారుమబ్బు విడిపోయినట్టు రిలీఫ్‌తో నిట్టూర్చి అతను వెనక్కి తిరిగేడు. విశాలంగా వున్న ఆ లాబొరేటరీ సీసాలూ, గాజు బీరువాలూ, యెటెండరూ తప్పిస్తే ఖాళీగా వుంది. ఒక మూలని స్టూలుమీద బోనులో గడ్డితింటున్న చెవుల పిల్లులు క్లాసులో పకోడీలు తింటూ మేష్టారుకి దొరికిపోయిన బడిపిల్లల్లా తిండిమానేసి అతనివేపు భయంకంటే ఎక్కువ భక్తితో చూశేయి.

మధుసూదన్ లేబరేటరీ నుండి తన గదిలోకి వెళ్తున్నప్పుడు ఎర్రతివాసీ అతని జోళ్ళ చప్పుడు తనకింద దాచుకుంది. అతను గదిలోకి రాగానే యెటెండరు అతని నల్లకోటు తీసి హేంగరుకి తగిలించి వాష్‌బేసిన్ దగ్గర తువ్వాలు పట్టుకొని నిల్చున్నాడు. అతను చేతులూ, మొహం కడుక్కున్నాక, కాఫీ కప్పులో పోసి, డ్రాయరులో నుండి సిగరెట్ కేసూ, లైటరుతీసి టేబిలుమీద యాష్‌ట్రే ప్రక్కన పెట్టేడు.

మధుసూదన్ వున్న ముప్పై ఏళ్ళకంటే మరో పదేళ్ళు యెక్కువున్నట్టు కన్పిస్తాడు. జుత్తు బాగా నెరియడంతో ఫోటోలో యాభై దాటినవాడిలా కనిపిస్తాడు. అతను వేసుకున్న సూట్ బాగా ఖరీదైనదైనా మూడేళ్ళనాటిది. అతని జోళ్ళు బాగా పాలిష్ చేయబడినవైనా కొత్తవి మాత్రం కావు. అతని నిరంతరాలోచన అతని నుదుటిమీద లోతు గీతలుగీసి పోయింది. అతని కళ్ళల్లోని "కలలచూపు" అతను యీ లోకం వాడు కాడేమో ననిపిస్తుంది. అతను బరువైన మనుష్యుల్లోనే లెక్క.

సిగరెట్ యింకో నిమిషంలో అయిపోతుందనగా అతను ఎటెండరువేపు చూశేడు. ఎటెండరు టేబిలుమీదున్న ఫోన్ చేశేడు. సిగరెట్ అయిపోయేసరికి కారు వచ్చి లేబరేటరీ ముందు ఆగింది. కారు దగ్గరకు నడిచివెళ్ళి మధుసూదన్ లిఫ్ట్ ఇవ్వవలసిన స్నేహితుడికోసం ఆగిపోయినట్టు ఆగి, కాంపౌండులో మౌనంగా వున్న జంతుశాలవేపు చూశేడు. అదే టైముకి ఉరకలు వేస్తున్న రెండు కుక్కల్ని గొలుసు

లతో అపుతూ ఒక జవాను పరుగెత్తుకొచ్చేడు. ఆ కుక్కలు — తల్లిపోయిన పిల్లలు తండ్రిని చుట్టుకున్నట్టు మధుసూదన్ కాళ్ళకు చుట్టుకున్నాయి. మీదికిఎక్కి చేతులు నాకేయి. అతను తమనుయెత్తుకోనందుకు గారంగా అరిచేయి. అతని కడుపుమీద కాళ్ళు పెట్టితోకలాడిస్తూ నిల్చున్నాయి.'ఇంకోనెల మీకు' అని మనసులో అనుకొని వాటి తనివి తీరేక "ఇంక పొండి" అన్నాడు మధుసూదన్. జవాను కుక్కల్ని తీసుకుపోయాడు. ఆ కుక్కలు పూర కుక్కలు. వాటిని మధుసూదన్ సరిగ్గా 77 రోజుల కిందట సంపాదించేడు. వాటిని సంపాదించడానికి....

ఆ రోజు.... లేబరేటరీ నుండి యం.డి. (మేనేజింగ్ డైరెక్టరు) ఆఫీసుకి వెళ్ళేడు మధుసూదన్. అప్పటికి సాయంత్రం నాలుగు కాలేదు. బొందితో కైలాసా నికి తీసుకుపోయింది తొమ్మిదో అంతస్తుకు లిఫ్టు అతన్ని. వరండాలో నిలబడిన యూనిఫారం జవాను తీసిన గాజు తలుపులు దాటి ఆఫీసు చేరేడు అతను. ఔటర్ ఆఫీసులో 60 ఎమ్. ఎమ్. సినిమా వేసుకోవచ్చు. అక్కడ చప్పుడు చెయ్యని ఫేను కింద పనిచేస్తున్న మొగాళ్ళు సూట్ల ఎడ్వర్టైజ్‌మెంట్ వాళ్ళలా ఉన్నారు. ఆడ వాళ్ళు బట్టలషాపులో బొమ్మల్లా ఉన్నారు. యం.డి. ఆఫీసుద్వారం పక్కన సెక్రటరీకి ఆకుపచ్చటి టేబిలుంది. ఆ టేబిలు నాచుపట్టిన చెరువులా కాకుండా బిలియర్డ్సు టేబిలులా ఉంది. దాని వెనుకనున్న సెక్రెటరీ పళ్ళు కనిపించకుండా నవ్వడానికే పుట్టినట్టుంది. ఆమె వయస్సు పదేళ్ళనుండి ఒకచోటే వుంది. ఆమె రోజూ పాలల్లో స్నానంచేసే మనిషిలా మెరుస్తూ నున్నగా ఉంది. సిల్కుచీర జారకుండా పట్టుకునేం దుకే ఎదిగేయా అనిపించేటంత ఎత్తుగానూ, సూదిగానూ వున్నాయి ఆమె గుండెలు. అంతపెద్ద జుత్తుగాని లేకపోతే ఆమె మొహం పౌడర్ల డబ్బాల ఎడ్వర్టయిజ్‌మెంట్‌కి పనికివచ్చేది. అలాగని అమాయకురాలు మాత్రం కాదు. మూడు కాపురాలకి నిప్పు పెట్టింది. మరో యిద్దరు మొగాళ్ళు బికార్లు అయిపోయి దేశాలుపట్టి పోయేరు. ట్రావలర్సు బంగాళాలకి, రెస్టుహౌసులకీ ఆమెరాదు. "ఫైవ్‌స్టార్" హోటల్లోనే ఆమె పడుకుంటుంది.

ఎదురుగా వచ్చిన మధుసూదన్‌ని కూర్చోమని కళ్ళతోనే సౌజ్ఞచేసి "డాక్టర్ మధు టు సీయు సర్" అని టెలిఫోనులో చెప్పి "రమ్మంటున్నారు" అంది మధుసూదన్‌తో.

మధు లేచి యం.డి. గదిద్వారం దగ్గరికి వెళ్ళేడు. అక్కడ స్టూలు మీద కూర్చున్న ఆఫీస్‌బోయ్ లేచి సలాంచేసి తలుపు తెరిచేడు. మధుసూదన్ గదిలోకి వెళ్ళగానే మాయాగుహ ద్వారంలా తలుపు మూసుకుపోయింది.

యం.డి. ఎయిర్ కండిషన్డ్ గది చెరువుకింద గదిలా చల్లగానూ, చీకటి చీకటిగానూ వుంది అక్కడక్కడ దాగున్న దీపాలు వింతపాముల రంగుమణుల్లా మెరుస్తున్నాయి. గోడల్ని ఏ అలంకారాలూ లేవు. పెద్ద గ్లాస్ టాప్ టేబిలు వెనక కూర్చున్న యం.డి. వేసుకున్న సూటు వచ్చే సంవత్సరం ఇండియాలో ఫాషన్లోకి వస్తుంది. అవసరం అయితే పదిమందిని కొట్టగలడన్నట్టు బలంగా ఉన్న అతని వయసు చూడగానే ఎవరూ అంచనా వెయ్యడానికి ప్రయత్నించరు. విగ్గు పెట్టుకున్నాడా అని అనుమానం వచ్చేటంత దట్టంగావుంది అతని జుత్తు. అతని పళ్ళు బహు అందంగా వుండడంవల్ల అతను ఎప్పుడూ నవ్వుతూ వుండడానికే ప్రయత్నిస్తాడు. అతను జడ్జీ అయితే ముద్దాయికి ఉరిశిక్ష వేసినప్పుడు కూడా నవ్వుతూనే ఉండును.

చూస్తున్న కాగితం నుండి తన సోగ కళ్ళు ఎత్తకుండా "సిట్ డౌన్, మై బోయ్" అన్నాడు అతను.

మధుసూదన్ కూర్చున్నాడు.

"ఏవిటిలా వచ్చావ్? నాన్న కులాసాయేనా? అమ్మ డార్జిలింగ్ నుండి వచ్చేరా? నీ ఆరోగ్యం బాగుంటుందా? ఎన్నిసార్లు ఆఫీసుకు రమ్మని బతిమాలినా రానివాడివి యీ వేళైనా వచ్చేవు" అని "ఎందుకు వచ్చేవ్!" అని అడగబోయి మానేసి చదివిన కాగితం సంతకం చేసేడు.

"నాకు కుక్కలు కావాలి" అన్నాడు మధుసూదన్.

"కుక్కలా? ఎన్ని?" నాకు బలపంకావాలి అని మధుసూధన్ ఏడిచినా యం. డి. అంత ఆశ్చర్యపోయి వుండడు.

"వదో ఇరవయ్యో" మధు కళ్ళు దించుకున్నాడు.

"అన్ని కుక్కలేం చేసుకుంటావ్? డాగ్ రేసింగ్ పెడతావా ఈ ముష్టి దేశంలో. లేకపోతే కుక్కల వ్యాపారం పెడతావా!" జవాబు చెప్పకపోయినా ఫరవా లేదన్నట్టు అడిగాడు.

"అంతకు తక్కువ సరిపోవు"

"ఇంతకీ నీకు కుక్కలెందుకయ్యా? అప్పుడే పిల్లలు పుట్టరని బెంగ పెట్టు కున్నావేఁవిఁటి? ఇంతకీ కుక్కలు 'సూ'కా! నీకా" గుక్క తిప్పుకోడానికి ఆగాడు యం.డి.

"నాకే" తన కుర్చీ వెనకకాళ్లు చూస్తూ అన్నాడు మధుసూదన్.

"నీ కెందుకు బాబూ కుక్కలు? కావాలంటే గుర్రాలు అడుగు. పందెపు గుర్రాలు పంపుతాను"

"కుక్కలే కావాలి"

"సరే ఏ జాతివి? ముద్దుగా జేబులో పడేసుకోవచ్చు పెకినిస్ పంపమంటావా? లేకపోతే పామరేనియన్సు కావాలా? మొగాడివి కాబట్టి పెద్దకుక్కలు కావాలేమో, అల్సేషియనులు మాత్రం వద్దు. ప్రతి కిల్లీకొట్టు వెధవా ఒక అల్సేషియను పెంచుతున్నాడీ రోజుల్లో. డాల్మేనియన్సు— గోల్డెను రిట్రీవర్సు—బ్లడ్ హౌండ్సు— ఏవి కావాలి? లేకపోతే అమెరికను అంబాసిడరు పెళ్ళాందగ్గర ఏవో కొత్తరకాలున్నాయిట. రేపు కనుక్కుంటానుండు" ఎంత జోరుగా మాటాడుతున్నాడో అంతజోరుగానూ ఆలోచిస్తున్నాడు యం.డి.

"నా కవేం వద్దు. ఊరవి కావాలి"

"ఇప్పుడేవిఁటన్నావ్ మళ్ళీ అను" తన చెవులను మొదటిసారి శంకిస్తూ అన్నాడు యం.డి.

"ఊరకుక్కలు కావాలి"

"ఆడవా, మగవా?"

"ఏవైనా ఫర్వాలేదు. చర్మవ్యాధులున్నవి కావాలి"

"నీక్కావలసింది కుక్కలూ కాదు. పిల్లలూ కాదు. అంత అంత అహో రాత్రాలు పనిచెయ్యకయ్యా అంటే వినకుండా మనసు చెడగొట్టుకున్నావు. నెల శలవు యిస్తాను. హాయిగా 'సూ'తో దేశం తిరిగిరా. ఈ ఎండకి నేనే మా సెక్రెటరీని కరి చేస్తానేమో ననిపిస్తూంది. కుక్కలు దేనికి?"

"నేను హాన్సన్సు డిసీజ్ (Hansons disease)కి మందు కనిపెడుతున్నాను"

"పేలకి, గజ్జికి కనిపెట్టలేక పోయేవ్? చూడూ. ఈ జబ్బులు బీదవాళ్ళవి. వాళ్ళకి మందులు కొనుక్కోడానికి డబ్బుండదు. మనం డాక్టర్లకిచ్చే ఫ్రీ సేంపిల్స్ మీద బతికేస్తారు డయాబిటిస్‌కి మందు కనిపెట్టేవు, అది మన కంపెనీకి గోల్డ్ మైను అయింది. బ్లడ్‌ప్రెషరుకి కనిపెట్టేవు. అది డైమండ్ మైను అయింది.

మనది కంపెనీ, ధర్మసంస్థ కాదు. మనుషులందరికీ కొన్నిరకాల జబ్బులొస్తే, పేలూ, గజ్జి, కుష్టు పేద వెధవలకే వస్తాయి. వాటికి మనం మందులు కనిపెడితే ముసుగులు వేసుకొని మిషనరీల పైపోవాలి; కొంచెం ముందూ వెనకా చూడు. గొప్ప వాళ్ళ జబ్బులకి మందు కనిపెడితే మనం నాలుగుడబ్బులు చేసుకోవచ్చు. నాకు తెలుసు, నువ్వు ఆదర్శాలు, ఆదర్శాలు అంటూ ఆకాశంలో మకాం పెడతావని. ఈ కంపెనీ నడపలేక నేను పిచ్చెక్కి పోతున్నాను."

"కాని...."

"నాకు తెలుసు. నువ్వు సైంటిస్టువి. ఇటొచ్చి పిల్లులు తే, అటొచ్చి పంది కొక్కులు తే అనగలవు. కాని నా బాధ ఎవరితో చెప్పుకోను. తెల్లారిలేస్తే ఇన్‌కం టాక్సు ఇనస్పెక్టర్ని అనో, డ్రగ్సు ఇనస్పెక్టర్ని అనో వొకడు దిగిపోతాడు. ఆఖరికి మన అడ్వర్టయిజుమెంటు పిల్లలేదూ, చూడ్డానికి కర్రి గాడిదలా వుంటుందా! అయితే నేం ఫొటోలో నలుపయినా తెలుపైనా ఒకటేగా! కాస్త ఎత్తు పళ్లాలున్న మనిషి. ఆ సంగతి దానికి తెలుసు. డెపిలేటరీ అడ్వర్టయిజుమెంటుకి నా ఫొటోయేనా, స్లిమ్మింగు అడ్వర్టయిజుమెంటుకి నా ఫొటోయేనా అని పేచీ పెడుతోంది యివేళ. నువ్వుకూడా నా మాట కాదంటే నేను బతకలేను. కాబట్టి బాబ్బాబు, ఈ మందు మానుకో".

"మందు తయారై పోయింది .... ట్రయలేసుకోవాలి".

"అయితే నే చేసేదేముంది? అది పనిచేస్తే చాలు పెద్ద జబ్బుకి గొప్పమందు కనిపెట్టేమని చెప్పుకోవచ్చు. మందులు తయారయేక— దొరలు ఎవరో ఒకరు కుష్టురోగ నివారణ కేంద్రాలు పెడుతూనే ఉంటార్లే — వాళ్ళకి టోకున అమ్మేస్తాను—"

"మరి కుక్కలు—"

"మూడ్రోజుల్లో పంపిస్తాను. కాని ఒక్కమాట ఇటుపైన నువ్వు ఇలాంటి వెర్రిమొర్రి జబ్బులకి మందు కనిపెట్టేలోగా నా చెవిని పడెయ్, ఆజీర్తికి మందు కని పెట్టాలిగాని ఆకలికి కనిపెట్టి ఏం లాభం? మంచిది వెళ్ళు."

—మరో మూడ్రోజులకి పదికుక్కల్ని పంపేడు యం.డి. "బాబూ యీమారు ఏనుగులు కావాలంటే పంపుతాను గాని కుష్టుకుక్కలు మాత్రం అడుగకు" అంటూ.

వచ్చిననాడు యీ కుక్కలు చెద తినేసిన కుక్కల్లా వున్నాయి. ఇప్పుడు జబ్బు పూర్తిగా పోయినట్టే, అంటే మందు బాగా పనిచేసిందన్నమాట. కొద్దిమార్పులు చేస్తే యీ మందు మనుష్యులకూడా పనిచేస్తుంది.

మందు తయారు చేసేక యం.డి.ని కోరలేదు మధుసూదన్. అడిగితే రోగుల్ని పంపుతాడుగాని అతని లెక్చర్లు భరించడం కష్టం. అంచేత తన మందు వాడి ప్రయత్నించడానికి ఎవర్నేనా కుష్టురోగుల్ని తెమ్మని తన జవానుతోనే చెప్పేడు మధుసూదన్. జవాను నలుగురు రోగుల్ని తీసుకొచ్చేడు. ముగ్గురు మగ, ఒక ఆడ.

నరకం నుండి జారిపోయిన పాపుల్లా వున్నారు వాళ్ళు.

వాళ్ళని చూస్తే నిన్నటి డిన్నర్ వాంతి అయేటట్టుంది. వాళ్ళని సగం ఉడి కించి, కాల్చినట్టున్నారు.

వాళ్ళ ముక్కులు విరిగి వాచివున్నాయి.

వాళ్ళ పెదవులు వాళ్లే కొరికేసుకున్నట్టు ఉబ్బి వున్నాయి.

వాళ్ళ చెవులు యెవరో రాక్షసుల చెవులు తీసుకువచ్చి అతికించినట్టు పెద్దవిగా వున్నాయి.

వాళ్ళ బట్టలకి రక్తం మరకలు లేనిచోట చీము మరకలున్నాయి.

వాళ్ళ జుత్తు అంతా పీకేసి మళ్ళీ అక్కడా అక్కడా కొంచెం వెంట్రుకలు అతికించినట్టు అతి పల్చగా వుంది.

వాళ్ళ కళ్ళముందున్న డబ్బాలలో చిల్లర డబ్బులున్నాయి.

వేళ్ళు పూర్తిగా ఊడనివాళ్ళ చేతుల్లో కర్ర చిడతలున్నాయి.

జవాను వాళ్ళకి మందుగురించి అంతా చెప్పేడు. ఆ మందు వాళ్ళకి కంపెనీ

నడుస్తున్న చరిత్ర :

తిరిగి తిరిగొచ్చింది...

కె. బాలగోపాల్

మళ్ళీ మొదలయిన నిర్బంధంమీద ఇది రిపోర్టుకాదు. ఎందరిని చంపారో ఎట్లా చంపారో వివరించే పట్టిక కాదు. రిపోర్టులు రాసుకున్న తరువాత, పట్టికలు తయారుచేసుకున్న తరువాత, ప్రజాస్వామిక వాదులంతా అన్ని విషయాలూ విడమరచి చెప్పినా చివరికి చెన్నారెడ్డి ఇట్లా చేసాడే అని కొంత మనస్తాపం చెందిన తరువాత, గడచిన సంవత్సర కాలం చరిత్రను నెమరువేసుకొని ఆలోచించడం అవసరం.

పాలకవర్గాలకు నీతిలేకపోయినా కనీసం ఇంగితం ఉంటుందని ఆశిస్తాం. ప్రజల క్షేమాన్ని కాకపోయినా కనీసం తమ క్షేమాన్నయినా కాంక్షిస్తారని భావిస్తాం. వాళ్ళు స్వల్పకాల ప్రయోజనాలే తప్ప దీర్ఘకాల శ్రేయస్సును గురించి ఆలోచించే స్థితిలో సహితంలేరని అర్థం చేసుకోవడానికి కొంత కాలం పడుతుంది. పాలకవర్గాల లోని వివిధ ముఠాలను సమానంగా సంతృప్తిపరచడం వాళ్ళ ఐక్యతకే అవసరం అని ఏ అణాకాణీ పత్రికా సంపాదకుడయినా చెప్పగలడు. అయినా అధికారానికి వచ్చిన తొమ్మిది నెలల తరువాత కూడ చెన్నారెడ్డి తన ప్రభుత్వంలోని అన్ని లాభ

ఉచితంగా ఇస్తుందనీ, ఆరునెల్లో వాళ్ళు మామూలు మనుషులై పోతారనీ, ఆ ఆర్నెల్లూ కంపెనీయే వాళ్ళని పోషిస్తుందనీ కూడా చెప్పేడు.

"ఆ తర్వాత?" ఆడది అడిగింది.

మధుసూదనూ, జవానూ జవాబు చెప్పలేదు.

"వద్దుబాబూ. దేశంలో కూలిలేదు, కూలిపుట్టదు. ఆకలికి కాలి సావాలి. జబ్బుతోనైనా నాలుగుకాలాలు బతకనీయండి బాబూ" అంటూ వెళ్ళిపోయేరు వాళ్లు వైద్యం వద్దని.

దూరమైపోతోన్న వాళ్ళవేపే చూస్తూ నిలబడ్డాడు మధుసూదను. వాళ్ళ వెనక సూర్యుడు భగ్గుమని మండుతున్నాడు.

దాయకమయిన శాఖలనూ తన దగ్గరే ఉంచుకున్నాడు.ఎక్సైజ్, అడవులు, రెవెన్యూ, హోం - అన్నీ తనవే. జనార్ధనరెడ్డినీ శ్రీనివాసులురెడ్డినీ విడతలు విడతలుగా అవమానపరుస్తాడు. 'కల్లోలం' ఉందనయినా కరీంనగర్‌ను గుర్తించడు. రాజశేఖరరెడ్డి ఉన్నాడని కసికొద్దీ కడపను గుర్తించడు.

ఇది దోపిడీ రాజ్యం మాత్రమేకాదు. దీర్ఘకాల ప్రాతిపదికగానీ దానికి అవసరమయిన సంయమనంగానీ లేకుండ ఎక్కడికక్కడ ఎంత దొరికితే అంత కబళించే రాజ్యం. తన అంతర్గత క్షేమాన్ని గురించి సహితం ముందుచూపులేని పాలన. ఇంక ప్రజా ఉద్యమాల విషయంలో దీనికి ముందుచూపు రమ్మంటే ఎక్కడినుండి వస్తుంది? అయినా 'కర్మణ్యేవాధికారస్తే' అని నమ్మిన జాతి కాబట్టి చెప్తానే ఉంటాం. నీ మంచికోసమే, నీ శాంతిభద్రతల కోసమే, నీ పరిపాలన యోగక్షేమాలను దృష్టిలో పెట్టుకునే, చెప్తున్నామని చెప్తాం. (వినకపోతే నువ్వే చెడిపోతావని చెప్తాం).

మనసులో మట్టుకు వినకపోతే వాడు చెడినా చెడకున్నా ప్రజలు మరొక పర్యాయం హింసకు గురవుతారన్న భయం ఉంటుంది. నిజానికి అందుకోసమే చెప్తాం. నీ మంచికోసమేనని నచ్చజెప్పి ప్రజలకు మేలు చేద్దామని ఆశిస్తాం. మనం తెలివయిన వాళ్ళమనుకుంటే వాడికి మట్టుకు తెలివిలేదా ?

'స్వేచ్ఛను దుర్వినియోగం చేసారు' అంటాడు, ఎందుకని అడిగితే. పిల్లవాడు సైకిల్ పాడుచేస్తే తీసేసుకున్నట్టు దాన్ని తీసేసుకున్నాడట. 'మరి నువ్వు సద్వినియోగం చేస్తున్నావా' అని అడగకూడదు. వాడు తన స్వేచ్ఛను పుట్టుకతో పొందాడు. ప్రజలు వాడినుండి భిక్షగా పొందారు 'నేను మీటింగ్‌లు పెట్టుకోనిస్తే నన్నే తిడతారా ?' అంటాడు. 'మేము వోట్లు వేస్తే మమ్మల్నే చంపుతావా' అనకూడదు. చంపడం రాజధర్మం. 'నా దగ్గర లైసెన్స్ తీసుకోకుండ తుపాకులు కొంటారా ?' అంటాడు. 'మరి నువ్వు మమ్మల్ని చంపేవాళ్ళకు లైసెన్స్‌లు ఇస్తావుగానీ మాకు ఇయ్యవుకదా' అని అడగకూడదు. అస్తులు ఉండేవాళ్ళకు ఆత్మరక్షణగానీ దిక్కుమాలిన వాళ్ళకు కూడానా ? 'మీ అవసరాలకోసం మా వాళ్ళనుండి డబ్బులు వసూలు చేసుకుంటారా ?' అంటాడు. 'మరి మావాళ్ళ దగ్గర లేవుకదా' అనకూడదు, 'మీ దగ్గరుండేదంతా మాదేకదా' అనకూడదు. అది అదనపు ప్రసంగం అవుతుంది. 'పోనీకదా అని ఎన్‌కౌంటర్లు ఆపేస్తే మావాళ్ళ భూములు ఆక్రమించి

మీ వాళ్ళకు పంచుతారా' అంటాడు. 'మరి మా వాళ్ళ భూములు ఖబ్జా చేసుకొని మీలో మీరు పంచుకోవడంలేదా' అని ఎదురుప్రశ్న వేసే అవకాశం మీకుండదు, ఈ లోపల మిమ్మల్ని 'టాడా' క్రింద జైల్లో పెడతాడు. 'మీరే కోర్టుఐపెట్టి న్యాయ నిర్ణేతలా ధర్మ నిర్దేశకులా అవుతారా' అంటాడు. 'సమాంతర ప్రభుత్వాలు నడుపుతారా' అంటాడు. మీలో ఈ పని చేయని వాళ్ళెవరయినా ఉన్నారా అని అడగకూడదు. చిత్తూరులో చెంగారెడ్డి, తాడిపత్రిలో దివాకరరెడ్డి, పులివెందులలో రాజశేఖరరెడ్డి, నరసరావుపేటలో కృష్ణారెడ్డి-వీళ్ళు నడుపుతున్నవి సమాంతర ప్రభుత్వాలు కావా అని అడగకూడదు.

తాము ధనవంతుల ప్రయోజనాలకోసం చేసే పనులే పేదవాళ్ళ ప్రయోజనాల కోసం చేపడితే అది 'స్వేచ్ఛను దుర్వినియోగం చేయడం' అవుతుంది. అప్పుడు 'స్వేచ్ఛ' అనే మాటకు అర్థం ఏమిటో కూడ మనకు అర్థం అవుతుంది.

వాడికి ఏవో కారణాలు దొరకవని కాదు. ప్రజా ఉద్యమాలు సరళరేఖలో నడవవు. ప్రజా చైతన్యం ఎగుడుదిగుళ్ళు లేకుండ సాఫీగా ఎదగదు. బలవంతులూ, ధనవంతులూ చలాయించే అధికారాన్ని పేదలు చేజిక్కించుకోవడంతో సరిపోదు. దృక్పథంలో విలువలలో సమగ్రమయిన మార్పు రావడానికి కొంత కాలం పడుతుంది. వర్గ దృక్పథం అనేది ఒక్క భూమి సంబంధాలకే కాదు, సమాజంలోని అన్ని విషయాలకూ వర్తిస్తుంది. అన్ని సామాజిక విలువలకూ వర్తిస్తుంది. భూమి విషయంలో వర్గ దృక్పథం ఏర్పడినంత సులభంగా ఇతర విషయాలలో ఏర్పడదు. నేరము, శిక్ష, కుటుంబ సంబంధాలు, లైంగిక నీతి, ప్రజల మధ్య వైరుధ్యాలు - ఈ అన్ని విషయాలలోనూ సరయిన ప్రజాస్వామిక దృక్పథం ఏర్పడడం అనేది కొంత ప్రయాసమీద జరుగుతుందిగానీ తనంతట తాను జరగదు. ఈ సమాజంలో పుట్టి పెరిగిన వారిలో ఈ సమాజం నిర్దేశించిన విలువలే ప్రబలంగా ఉంటాయి. జీవిత అనుభవంతో కొన్ని విలువలను తిరస్కరించినా మిగిలినవి పోవడానికి చాలా పోరాట అనుభవం, రాజకీయ పరిణతి అవసరం అవుతాయి. అట్టడుగు వర్గాలలో పుట్టిన వారిలో వర్గకసి పెల్లుబికినంత వేగంగా విశాల ప్రజాస్వామిక దృక్పథం ఏర్పడదు. అది ఒక క్రమంలోనే జరగగలదు.

అంతే కాదు. శతాబ్దాలుగా అణచివేతకు గురయి 'అధికారం'నుండి వెలివేయబడ్డవాళ్లు అధికారపీఠం మీద తిరుగుబాటు చేసి దాన్ని బద్దలు గొట్టి అధికారాన్ని తాము కొంతమేరకు చేజిక్కించుకున్నప్పుడు దానితోబాటు అధికార సంస్కృతిని కూడ స్వంతంచేసుకునే ప్రమాదం ఉంది. దీనిని నివారించే ప్రయత్నం ప్రజా ఉద్యమాలలో ఒక ముఖ్యమయిన అంతర్గత పోరాటం.

అధికారానికి కొన్ని సంకేతాలుంటాయి. ఆ సంకేతాలే అధికారాన్ని సూచిస్తాయి. సంకేతమే అధికారం అనుకునేంతగా అవి ప్రామాణికతను పొందుతాయి. ఏ అధికారమయినా ఒక చారిత్రక క్రమంలో ఏర్పడుతుంది. కాబట్టి ఆ చారిత్రక క్రమంలో పుట్టిన ఉన్నత విలువలూ లక్షణాలూ ఆ అధికార సంస్కృతిలో చోటు చేసుకుంటాయి. వాటితో బాటు అధికారం అనే దానికి సర్వత్రా ఉండే అణచివేత లక్షణం, ఒక్కొక్క అధికార రూపానికే ప్రత్యేకంగా ఉండే నీచమయిన లక్షణాలు, ఆ సంస్కృతిలో ఉంటాయి. సాధారణంగా అధికార సంస్కృతిలోని ఉన్నత విలువలు కాక నీచమయిన విలువలే దానికి సంకేతాలవుతాయి. అధిపత్యం అనేది మౌలికంగా అప్రజాస్వామికం కావడం దీనికి కారణం కావచ్చు. రాజ్యాధికారం అనే దానిలో ప్రజా సంక్షేమానికి సంబంధించిన ఎన్ని విలువలున్నా బలప్రయోగమే దానికి సంకేతం అవుతుంది, మిలిటరీ యూనిఫారమే దానికి సూచిక అవుతుంది. మగపెత్తనపు విలువ అయిన 'మగతనం' అనేవానికి ధైర్య సాహసాలకంటే మొరటుదనమూ తిరుగుబోతు తనమూ ఎక్కువగా ప్రమాణాలవుతాయి. బ్రాహ్మణీకం ప్రథమ పురుషార్థాన్ని గురించి ఎంత మాట్లాడినా ఎదుటివారిని నీచంగా చూసే అహంభావమూ శుష్కపాండిత్యమూ దాని ప్రధాన లక్షణాలవుతాయి. ఫ్యూడల్ దొరతనం ఎంత కళాపోషణ చేసినా, నా మాటకు ఎదురులేదనే నియంతృత్వపైఖరే దానికి సంకేతం అవుతుంది.

అణచివేతకు వ్యతిరేకంగా తిరగబడేవాళ్ళు అధిపత్యాన్ని బద్దలుకొడుతూ అదేసమయంలో అధిపత్యానికి ఉండే ఈ సంకేతాలను తరచుగా స్వంతం చేసుకుంటారు. వాళ్ళ మనసులలో అదే విజయానికి చిహ్నం అవుతుంది, ప్రమాణం అవుతుంది. ఒక అందమయిన కట్టడంగా తప్ప ఇతరత్రా విలువలేని ఎర్రకోట చారిత్రక కారణాలవల్ల భారతదేశంలో రాజ్యాధికారానికి సంకేతం అయింది. ఆ ఎర్రకోటను స్వంతం చేసుకొని దానిమీద తమ స్వంత జెండాను ఎగరవేయడం భారత

రాజ్యాధికారంమీద విజయానికి చిహ్నంగా కమ్యూనిస్టుల నుండి ఎన్టీ రామారావుదాకా తమ ప్రచారసాహిత్యంలో రాస్తూ ఉన్నారు. ఇది నిరపాయకరమయిన ఉదాహరణే గానీ, ఆ సంకేతం ఒక దుర్మార్గపు ఆచారమో విలువో అయినప్పుడు అది ప్రమాద కరంగా పరిణమించగలదు. ఈ ప్రమాదాన్ని గుర్తించడం, నివారించడం, అవసరం. ప్రజాకోర్టులలో నేర విచారణ పద్ధతులు, వేసే శిక్షలు, భూస్వాముల పంచాయితీల నమూనాలో ఉన్నాయని కొన్ని ప్రాంతాలనుండి వస్తూన్న విమర్శను ఈ దృష్టితో సీరియస్‌గా పరిగణించి సవరించుకోవడం తప్పనిసరి కర్తవ్యం. ఇది ప్రజా ఉద్య మాల అంతర్గత సమస్య. ఇవి ఉద్యమ క్రమంలో పరిష్కారం కావలసిన పొరబాట్లు. చెన్నారెడ్డికి మట్టుకు ఇదంతా 'దుర్వినియోగం' అనే ప్రచారానికి మందుగుండుగా ఉపయోగపడుతుంది. ఉపయోగిస్తాడు.

ఏ ప్రచారమయినా చేసేవాడికంటే మోసేవాళ్ళ మీద, వినేవాళ్ళమీద, ఎక్కు వగా ఆధారపడి ఉంటుంది. మోయడానికి తగినంత మంది సిద్ధంగా ఉంటేనే చేసే ప్రచారం అనాయాసంగా విజయవంతం అవుతుంది. ఎంత మంది సిద్ధంగా ఉన్నారో గత మూడు నాలుగు నెలల సంఘటనలు రుజువు చేస్తాయి. పాలక వర్గాల ప్రయోజ నాలను సిద్ధాంతీకరించే ప్రచారాన్ని తమ స్వంత పనిగా భావించి మోసుకువెళ్లేవాళ్ళు సమాజంలో చాలామంది ఉంటారు. ప్రొఫెసర్లు, పత్రికా విలేర్లు, సంపాదకులు, కథకులు, సినిమా స్క్రిప్ట్ రచయితలు, రాజకీయపార్టీల ప్రచారకులు - ఇటువంటి మేధావులు సమాజంలో అసంఖ్యాకంగా ఉంటారు. ఇక వినే వాళ్ళంటారా, ఈ మేధావులు చెప్పేదంతా నిజమేనని తరతరాలగా నమ్ముతున్న వాళ్ళు కొందరు, తమ స్వంత ప్రయోజనాల దృష్ట్యా నమ్మే వాళ్ళు కొందరు, ప్రజా ఉద్యమాల ఫలితంగా సాంప్రదాయిక సామాజిక విలువలు తలక్రిందులు కావడాన్ని సహించలేని వాళ్ళు కొందరు, తమలోని నిరాశా దౌర్బల్యంవల్ల దుష్ప్రచారాన్నే త్వరగా నమ్మేవాళ్ళుకొందరు—మొత్తానికి ప్రజా ఉద్యమాలకు వ్యతిరేకంగా జరిగే ప్రచారాన్ని నమ్మడానికి సిద్ధపడేవాళ్లూ చాలా మందే ఉంటారు. అది శరవేగంగా సమాజంలో పాకిపోతుంది. మౌలికమయిన సమస్యలను లేవదీసే సామాజిక ఉద్యమ మేదయినా మన జీవితాన్ని అనేక విధాలకుదిపేసి మనల్ని రకరకాల మానసిక సామా జిక ఇబ్బందులకు గురిచేస్తుంది. అందుకే పాలకులలో ఎంతటి అవినీతినయినా అక్రమప్రవర్తన నయినా క్షమించే వాళ్ళం ఉద్యమాలలో దొర్లే చిన్నపొరబాట్లను

సహితం క్షమించం. వ్యవస్థ సుస్థిరతకూ మన మానసిక శాంతికీ లంకెవుంది. వ్యవస్థను కాపాడే శక్తులలో ఇది ఒకటి భూస్వాముల పంచాయితీలలోనూ పోలీసుల నేర విచారణలోనూ ఎన్నో అన్యాయాలు నిత్యం చూస్తూ ఉంటాము. అవి అన్యాయాలేనని ఒప్పుకున్నా అవి వ్యవస్థలో భాగం కాబట్టి మనకు పెద్దగా ఆందోళన కలిగించవు. దళిత వర్గాల వాళ్ళు, అందులోనూ ఇప్పుడిప్పుడే యుక్తవయస్కులవుతున్న వాళ్ళు, పంచాయితీలు నిర్వహించడం మన సాంస్కృతిక విలువలనే తలక్రిందులు చేసే విషయంకాబట్టి ఆ పంచాయితీలు పూర్తిగా సవ్యంగా ఉంటే తప్ప సహించం. విప్లవకారులమీద చాలా సత్ప్రవర్తనాభారం పెడతాం. విప్లవం అంటే మనకు ఉండే మానసిక అసహనానికి ఇది తార్కాణం. రాజకీయ సంసిద్ధత ఉండేవాళ్ళలోనూ ఈ మానసిక అసహనం చాలా ఉంటుంది. ప్రజాకోర్టులవల్ల పెత్తనాన్నీ ప్రాబల్యాన్నీ ఆదాయాన్నీ కోల్పోతూన్న భూస్వాములూ రాజకీయనాయకులూ పోలీసులూ దీనిని ఉపయోగించుకొని తమ దుష్ప్రచారాన్ని ముందుకు తీసుకుపోతారు.

నిజామాబాద్ జిల్లా మదనపల్లెలో ఎస్. పి. రఘువీర ప్రసాద్‌మీనా ఆధ్వర్యంలో జూన్ 11 తెల్లవారుజామున ప్రసాద్, నరసమ్మ, స్వామి, అనే ముగ్గురు హతమార్చబడతారు. అయ్యోపాపం అని ఎవరూ అనే లోపలే ప్రసాద్ ప్రజాకోర్టులు నిర్వహించిన తీరును మీనా ప్రచారంలో పెడతాడు. అతను ప్రయోగించిన హింసా పద్ధతులను అభివర్ణిస్తాడు. పత్రికలు దీనినంతా రాస్తాయి. ప్రసాద్‌ను చంపేయగా పల్లెలన్నీ హాయిగా ఊపిరి పీల్చుకుంటున్నాయని రాస్తాయి. అందరూ చదివి, స్వేచ్ఛను ఇంతగా దుర్వినియోగంచేస్తే 'ఎన్‌కౌంటర్లు' జరగక ఏమవుతుందని పెదవి చప్పరిస్తారు. కానీ నరసమ్మనూ స్వామినీ ఎందుకు చంపావని ఎవ్వరూ మీనాను అడగరు. అసలు ఒక పోలీస్ అధికారి ఒక వ్యక్తిని చంపేసి, 'ఇప్పుడు ప్రజలంతా హాయిగా గాలి పీల్చుకుంటున్నారు' అని ప్రకటిస్తే దానిని ప్రచురించడమే ఘోరమయితే మరొక ఇద్దరిని ఎందుకు చంపావని ఎవ్వరూ అడగలేకపోవడం దానికి పదిరెట్లు ఘోరం. నరసమ్మగురించి ఎవరూ చెడుగా ఏమీ చెప్పడంలేదు. స్వామి గురించి ఇంకా నాలుగు మంచి మాటలే చెప్తారు. అంతేకాదు, అదే ప్రసాదు అదే వూళ్ళో భూస్వామి భూమిలోని కలప కొట్టించి ఊరందరికీ పంచాడంట. భూస్వామి గోదాములోని ధాన్యాన్ని కూడ ఊరందరికీ పంచాడంట. ఇది విప్లవకార్యక్రమంకాదని

విమర్శించే వాళ్ళు ఉంటారుగానీ 'స్వేచ్ఛను దుర్వినియోగం చేయడం' అని మీనా కూడ అనడు. అయినా ఇదేదీ ప్రచారం కాదు.

ఒకసారి అప్రచారం చేసిన తరువాత మరొక రెండు ఎన్‌కౌంటర్ల దాకా అదే సరిపోతుంది. తిప్పాపూర్‌లో జూలై 23వ తేదీన రఘువీర్ ప్రసాద్ మీనా స్వయంగా పక్కనుండి యాదగిరి, నర్సాగౌడ్, బాలిరెడ్డి, గాలిరెడ్డి అనే నలుగురిని పట్టపగలు ఇళ్ళనుండి బయటికిలాగి కాల్చేస్తాడు. అందులో నర్సాగౌడ్ 16 సంవత్సరాల పసివాడు. పొద్దున్నే పోలీసులు గ్రామాన్ని చుట్టుముట్టి ఇళ్ళన్నిటికీ గొళ్ళెంపెట్టి రోడ్లోకి వచ్చినవాళ్ళను ఊరిమధ్య కూర్చోబెట్టి జీపుకు మైకు కట్టి 8 మందిపేర్లు ప్రకటిస్తూ వాళ్ళందరినీ లొంగిపొమ్మంటూ ప్రకటన చేసారు. పశువుల కొట్టంలో దాక్కున్న బాలిరెడ్డినీ, తమ్ముడిని అరెస్టుచేస్తే ఎందుకు చేసారని అడగడానికి రోడ్లోకి వచ్చిన గాలిరెడ్డినీ, రోడ్లోనే దొరికిన నర్సాగౌడ్‌నూ పశువుల కొట్టంలోనే ఊరందరూ వింటూండగానే కాల్చేసారు. మిగిలిన వాళ్ళకోసం ఇల్లిల్లూ వెతికారు. దొరికితే చంపేస్తారని భయపడి పక్కగదిలో గడ్డివాములో దాక్కున్న యాదగిరిని పట్టుకొని గడ్డిలోనే కాల్చేసారు. మళ్ళీ ఆగస్టు 10వ తేదీన మెదక్ జిల్లా నాగాపురానికి చెందిన గద్దె సిద్ధయ్యనూ మన్నె యాదగిరినీ నిజామాబాద్ జిల్లా వెల్లుట్లలోని పోలీసుక్యాంపుదగ్గర కాల్చేసారు పోలీసుక్యాంపుమీద వాళ్ళుదాడిచేయడానికి సిద్ధమవుతూండగా ఎన్‌కౌంటర్ జరిగిందని అన్నారుగానీ వాళ్ళు చూపిస్తూన్న స్థలంనుండి బాంబు విసిరితే చెట్లకో తీగలకో తప్ప క్యాంపుకు తగలదు.

వీళ్ళందరినీ ఎందుకు చంపవలసి వచ్చిందో మీనా చెప్పలేడు. వాళ్లుచేసిన 'దుర్వినియోగం' ఏమీలేదు. ఉండనక్కరలేదుకూడ. అప్పటికే పత్రికలు ప్రజాకోర్టులలో జరిగిన తప్పులను తమ బాధ్యతగా ప్రచారంలో పెట్టడం మొదలుపెట్టాయి. ఆ తప్పులు జరిగిన వూళ్ళకూ ఎన్‌కౌంటర్లు జరిగిన వూళ్ళకూ ఏమీ సంబంధం ఉండనక్కరలేదు. అదే వూళ్ళలో ప్రజాకోర్టులలో ప్రజలకు న్యాయమూ జరిగి ఉండవచ్చును. అదంతా అనవసరం. ఇప్పుడిక నిజామాబాద్‌లో 'ఎన్‌కౌంటర్ల' కు అనుకూలమయిన భావవాతావరణం ఏర్పడిపోయింది.

అనుకూలమయిన భావవాతావరణం ఏర్పడకపోతే 'ఎన్‌కౌంటర్లు' చేయలేరని కాదు. ధర్మవరం దగ్గర కేశనాయక్‌నూ గోదావరిఖనిలో పిట్టల సత్తయ్యనూ ప్రత్యేక

మయిన 'కారణం' ఏమీ లేకుండానే కాల్చేసారు. కేశనాయక్‌ను మే 8వ తేదీన ధర్మవరం ఎస్. ఐ, ఓబులనాయనిపల్లి సమీపంలోని గుట్టమీదికి తరిమి కాల్పులు జరిపాడు. పిట్టల సత్తయ్యను గోదావరిఖనిలో బెల్లంపల్లి పోలీసులు సాయంకాలం నమాజు సమయంలో రోడ్డువెంబడి తరిమి కాల్చారు. ఈ రెండు హత్యలకూ 'ఆత్మరక్షణ' కథ మినహా వేరే నైతిక సమర్థన ఇవ్వాలని పోలీసులు ప్రయత్నం కూడ చేయలేదు. అక్కడ రాడికల్ కేశనాయక్‌కూ ఇక్క జనరక్షణ సమితి పిట్టల సత్తయ్యకూ మంచి పనులు చేసారన్న పేరే తప్ప చెడు చేసారన్న అభియోగం లేదు

'ఆత్మ రక్షణ' కథకూడ అనవసరం అనుకున్నచోట విప్లవ గ్రూపుల మధ్య ఉన్న అవాంఛనీయమయిన కలహాలను వాడుకోవడానికి సహితం వెనకాడలేదు. ఈ పరస్పర దాడులవలన ప్రజలకు నష్టమేగానీ చెన్నారెడ్డికొచ్చిన కష్టమేమిటో తెలీదు. ఏమీ లేకపోయినా వాడుకుంటూ ఉన్నాడు. మేము చంపడం మానేస్తే వాళ్ళే చంపుకుంటున్నారు చూడండి అని హేళన చేసాడు. అంతటితో ఊరుకోక రెండు హత్యలను ఆ పేరుతో కప్పిపెట్టాలని చూసారు. అంతిరెడ్డి వరంగల్‌జిల్లా ములుగు అడవి ప్రాంతంలో గిరిజనులకు రెండు దశాబ్దాలకుపైగా పరిచయం ఉన్న కమ్యూనిస్టునాయకుడు. అటువంటి వ్యక్తిని హైదరాబాదులో జూన్ 6వ తేదీ రాత్రి అపహరించి 7వ తేదీన చంపేసి 9 ఉదయం కరీంనగర్‌లో పి. వి. నరసింహరావు స్వగ్రామమయిన వంగర గ్రామశివారులో పారేసి కొద్దిసేపు 'గుర్తుతెలియని శవం' అనీ కొద్దిసేపు 'గ్రూపు తగాదాల్లో వేరే గ్రూపు వాళ్ళు చంపి ఉంటారు' అనీ ప్రచారం చేసారు. అదే ములుగు దగ్గరున్న లక్ష్మీదేవిపేటలో ఆగస్టు 6 రాత్రి రవీందర్‌రెడ్డి అనే పి. డి. యస్. యు. బాధ్యుడిని ఇంట్లోనుండి నిద్రలేపి ఊరిబయటకు తీసుకుపోయి కాల్చేసారు. ములుగు సి. ఐ. ప్రభాకరబాబు ఈ హంతక బృందానికి నాయకత్వం వహించాడని నమ్మడానికి ఆధారాలున్నాయి. పొద్దున్న జిల్లా ఎస్. పి. నాగరాజు వచ్చి 'ఫణిబాగ్చి గ్రూపువాళ్ళు చంపివుంటారు' అని చెప్పి వెళ్ళిపోయాడు.

'దుర్వినియోగం' అనే వాదనకు ప్రజాకోర్టులలో జరిగే బలప్రయోగం ఒక్కటేకాక భూస్వాముల మిగులు భూముల ఆక్రమణనుగూడ తార్కాణంగా వాడుకుంటూ వుంది ప్రభుత్వం. 'టాడా'ను విస్తృతంగా ప్రయోగిస్తూ వుంది. ప్రభుత్వమే ఎన్నో ఏళ్ళ క్రితం పంచుతానని చెప్పి చట్టాలుచేసి అమలు చేయక వదిలివేయగా ఆ పని ఇప్పుడు ప్రజలే చేసుకుంటే దానిని టెర్రరిస్టుచర్యగా వర్ణించి వేలసంఖ్యలో

గ్రామీణ పేదలనూ గిరిజనులనూ 'టాడా' క్రింద జైలుకు పంపటమే కాక, దీనినికూడ 'దుర్వినియోగం' అనే పేరుమీద విజయవంతంగా సమర్థించుకో కలుగుతున్నారంటే వ్యవస్థకుండే ప్రచారబలం ఎంతటిదో అర్థం అవుతుంది. ప్రభుత్వం చేపట్టే చర్యలకు అనుకూలంగానయినా వ్యతిరేకంగానయినా ఒక భావవాతావరణాన్ని కల్పించే కర్తవ్యాన్ని నిర్వర్తించే పట్టణ ప్రాంత మేధావి వర్గానికి గ్రామీణభూస్వామ్య ధనిక రైతు వర్గంతో ఎంత సన్నిహిత సంబంధం ఉందంటే భూముల ఆక్రమణ న్యాయమయిన పోరాటమనీ దానిమీద 'టాడా' ప్రయోగించడం దుర్మార్గమనీ చెప్పేవారు ఒక్కరూ మిగలలేదు. అక్కడక్కడ అత్యుత్సాహంతో భూస్వాములనేకాక మధ్యతరగతి రైతుల భూములనుకూడ ఆక్రమించుకోవడంవల్ల కొంత, భూములేకాక ఉద్యోగాలూ, వ్యాపారాలూకూడ ఉన్నవాళ్లు తమ భూములను మాత్రమే చూపించి తమను తాము మధ్యతరగతి రైతులుగా చలామణీ చేసుకునే అవకాశం ఉండడంవల్ల కొంత 'దుర్వినియోగం' అనే వాదనకు తార్కాణాలు కొన్ని దొరికాయి. అయినా ఈ వాదనను సహితం దిగమింగి నిర్బంధాన్ని ఆమోదించడానికి సమాజం సిద్ధంగా ఉందంటే భూ సమస్యను శాంతియుతంగా పరిష్కరించటం ఎంత అసాధ్యమో అర్థం అవుతుంది.

ప్రజా ఉద్యమాలు ప్రభుత్వాలకు సమస్యలు. ఆ విధంగా 'నక్సలైట్ సమస్య' అనే మాట పుట్టింది. సమస్యగా గుర్తించిన తరువాత ఇక దానిని పరిష్కరించాలి. అణచివేతే ఏకైక పరిష్కారంగా 20 ఏళ్లు వెంగళరావునుండి ఎన్టీ రామారావుదాకా ప్రయత్నించారు. ఆ వ్యూహం ఉచ్చయి వాళ్ళ మెడకే బిగుసుకునేసరికి ప్రత్యామ్నాయం కోసం అన్వేషణ ప్రారంభించారు. తమ మంచికోసమే ప్రారంభించిన ఈ ప్రయత్నాన్నయినా నిజాయితీగా కొనసాగిస్తారేమోనని ఆశించిన వాళ్ళకు నిరాశే ఎదురయింది. 'చట్ట సమ్మతమయిన కార్యక్రమాలను అనుమతించడం, చట్ట వ్యతిరేకమయిన వాటిని న్యాయసమ్మతంగా నిరోధించడం, గ్రామీణపేదల జీవితాలను బాగుపరిచే పథకాలు చేపట్టడం' అనే త్రిసూత్ర పథకాన్ని తన విధానంగా చెన్నారెడ్డి ప్రకటించాడు. ఆ త్రిసూత్రాలలో ఒక్కదానినీ అమలు చేయడం లేదు. చట్టసమ్మతమయిన బహిరంగ సభ -, ఊరేగింపులు అటుంచి కోర్టు విచారణలను సహితం జరగనివ్వడం లేదు. సి. ఐ. మొగిలయ్య చేతినుండి 'మాయం' అయిన వసంత సుజాతల అదృశ్యం మీద హైకోర్టు ఆదేశించిన విచారణను తుపాకుల ప్రదర్శనలో భగ్నం

శ్రీ శ్రీ కవిత్వం
చల చంచల సౌందర్యం

జె. సి.

ఆత్మ చరిత్రాత్మ చరిత్రాత్మక నవల అనంతంలో 1976లో తనను గురించి తాను చేసుకున్న వివరణలో శ్రీశ్రీ ఇలా అంటారు :

కొంత మంది శిల్పం అంటే ఇమిటేషన్ అన్నారు. మరికొందరు సృష్టి అన్నారు. నిజమైన కళ అనేది ఈ రెండూ కావేమో అని నా అనుమానం. ఉన్న వాస్తవాన్ని నిశితంగా లోతుగా పరిశీలించి, నిజాయితీతో దాన్ని వివరించాలి. ఇది చాలా కష్టంతో కూడుకున్న పని. ఇది సాధించడానికి ఇంకా నేను కృషి చేస్తూనే ఉన్నాను. పూర్తిగా కృతకృత్యుణి కాలేదు. కాని ఆకాశపు దారులంట వెళిపోయే "జగన్నాధుని రథ చక్రాలను" కొంతలో కొంతయినా భూమార్గానికి మళ్ళించ గలిగా

చేయాలని ప్రయత్నించి, మళ్ళీ హైకోర్టు జోక్యంతో విచారణను కరీంనగర్ నుండి హైదరాబాద్‌కు తరలించగా ఇక లాభం లేదని సాక్ష్యాలసేకరణకోసం తిరుగుతున్న సుభాష్‌ను ఆగస్ట్ 23 సాయంత్రం కొలిమికుంటలో అరెస్టుచేసి 24 ఉదయం కాల్చేసారు.

ఈ అతితెలివి విధానం ఎక్కడికి దారితీస్తుందని చెన్నారెడ్డి భావిస్తున్నాడో తెలీదు. మళ్ళీ పోలీసులూ మంత్రులూ పాతపాటే వినిపిస్తున్నారు. డి. జి. పి. రొడ్డం ప్రభాకరరావుగారు ఈ మధ్య ఎక్కడో మాట్లాడుతూ 'ఆరునెలల కాలంలో నక్సలైట్లను అణచి వేస్తాం' అన్నాడంట. గతంలో ఇదే ప్రగల్భం పలికిన హోం మంత్రులు కొందరు అయ్యప్ప దీక్ష పుచ్చుకుంటే మరికొందరు రిటైర్ మెంట్ పుచ్చుకున్నారు. ఆ పై ఖరి ఫలితంగా రాష్ట్రంలో పేద ప్రజానీకాన్ని మట్టుకు గత 20 ఏళ్ళలో భయంకరమైన హింసకు గురి చేశారు. ఇప్పుడు మరొక రౌండు అ పనే చేయాలని చూస్తున్నారు. అయితే గతంలో నడిచినంత సులభంగా ఈసారి ఆ పని జరుగుతుందనుకోవడం మూర్ఖత్వం అవుతుంది. ఏలినవారిలో 'ఇంటెలిజెన్స్'లోపించిం దనుకోవాలా, లేకపోతే ఎంతమంది చస్తే ఏంలే అనుకుంటున్నారా?

నసుకుంటున్నాను". (శ్రీశ్రీ అనంతం విరసం ప్రచురణ 1986 పేజీ 291. ఇక ముందు పేజీ నంబర్లే ఇవ్వడం జరుగుతుంది) కళ గురించీ, తన కవిత్వం గురించీ శ్రీశ్రీ చెప్పిన ఈ మాటలు ప్రకృతి, సమాజం, విజ్ఞానశాస్త్రం, కళల్లో ప్రాణంగా ప్రవహించే గతితర్కాన్ని సంపూర్ణంగా అనుభవం లోనికి తెచ్చుకుని చెప్పిన మాటలు అని కొంచెం ఆలోచిస్తే మనకర్థమవుతుంది.

శ్రీశ్రీ జీవితాన్ని, కవిత్వాన్ని ఏకసూత్రంతో బంధించేది గతితార్కిక, చారిత్రక భౌతిక వాదమని చెప్పవచ్చు. ఆయన కవితంలో, భావాల్లో సంక్షుబ్ధంగా ప్రవహించే విద్యుత్తులు భౌతిక వాస్తవాన్ని (Objective Reality), దాని పరిణామ శీలాన్ని నిష్కల్మషమైన నిజాయితీతో అర్థం చేసుకుని తదనుగుణంగా జీవించడం, ఆలోచించడం వల్లనే సాధ్యమయ్యాయని కూడా చెప్పవచ్చును. అంటే జీవితంలోనూ, కవిత్వంలోనూ ఆయన సైంటిస్టు వంటివాడు. తన జీవిత వాస్తవికతను ఒక సైంటిస్టుగా సందర్శించే ఉద్దేశంతోనే అనంతం రాసినట్లు కవిత్వాన్ని కూడ ప్రపంచ వాస్తవికతను పాంచభౌతిక సత్యాన్ని ఆరాధించే ఒక వైజ్ఞానికుడిగా (పేజి. 76) సందర్శించడానికే రాశారు. "కవిత్వం ఒక సైన్సు కాకపోవచ్చు గాని సైన్సు కవిత్వానికెంతయినా బలం చేకూర్చుతుంద" (పే : 146) నీ, "సైన్సుకులాగే, కవిత్వానికి కూడా ప్రయోగాలు లేనిదే అభివృద్ధి లేదు" (పే : 171) అని నమ్మిన వాడాయన. అయితే, గతితార్కిక భౌతికవాది కావడం వల్ల ఆ నమ్మకం నిరంతరం ఆచరణ శీలమైందాయన కవిత్వంతో.

నిప్పు, నీరు, గాలి, నేల, నింగి - ఏదీ దేవుడు కాదని తెల్సినా సాటిమాన వుణ్ణి జడిపించడానికి, వాడి చాకిరీని దోచుకోవడానికి అగ్నిహోత్రాన్ని ఆరాధ్య దైవాన్ని చేసింది పురోహితవర్గం. కార్మికుల కండబలం దోచుకోవడానికి మేధావుల మెదడు సృష్టించిందొక మిథ్యా దైవాన్ని (పే : 11). వాస్తవం లేక నిజం నిప్పు వంటిది. దానిపై నీళ్ళు చల్లకూడదు. అయినా, మిథ్యను - పవిత్రత, ప్రేమ, దేవుడు వంటి మిథ్యా విలువల్ని - పెంచి పోషించడానికి నిప్పును కూడ నీళ్ళతో కడిగే ఆచారపరాయణుల వంశంలో పుట్టిన శ్రీశ్రీ ఒక రెబెల్‌గా, రివల్యూషనరీగా ఎదిగాడు చారిత్రక కారణాలవల్ల.

వాస్తవాన్ని నిశితంగా, లోతుగా పరిశీలించి నిజాయితీతో వివరించే ధైర్యం గల శ్రీశ్రీ వ్యక్తిత్వంలో ఒక శ్రీ రెబెల్ అయితే, ఇంకో శ్రీ రివల్యూషనరీ అవుతుంది. "కవిత్వంతో నా ప్రయోగాలు" (అనంతం) లో చెప్పినట్లు "ధిక్కార గుణం" ఆయన కవిత్వానికే కాదు జీవితానికే ప్రాతిపదిక. చెప్పు విషయాల్లో (తాగుడు విషయంలో కూడ) ఆయనలో కనిపించే విశృంఖల ధోరణి ఆ ధిక్కార గుణం యొక్క ఒక అంశ అనుకోవచ్చు. ఇక కవిత్వానికి వస్తే, గతితార్కిక బద్ధమయి ఆధిక్కారగుణం "కల్పనా ప్రపంచం నుంచి కవిత్వాన్ని, వాస్తవలోకానికి మళ్ళించ" డానికి, "అందమైన అబద్ధాలను గాక నిష్ఠురమైన నిజాన్ని" ఆరాధించడానికి, "ఏదో ఒక కొత్తదనం కోసమే" (పే : 124) నిరంతరం అన్వేషించడానికి సహాయకారి అయింది. అంటే, ఆధ్యాత్మిక, అధిభౌతిక పరమార్థాల సరసన తిరుగుబాటు కూడా యాంత్రికమైన మరోరకం పరమార్థం (hypothesis) గా దిగజారకుండా భౌతిక వాద గతితార్కికత దాని ఒక రివల్యూషనరీ లక్షణంగా మలిచిందన్నమాట.

"గణబద్ధ చందస్సుల భూస్వామ్య యుగం నుంచి మాత్రాచ్ఛందస్సుల ప్రజాస్వామ్య యుగంలోనికి మార్గం మళ్ళించిన" (పే : 162-63) గురజాడ ముత్యాల సరాల రచన మొట్టమొదటిసారిగా 1910 లో చేశారు. అదే ఏడు అందరూ అరిష్టదాయకంగా భావించే ధూమకేతువు కనబడటం అనేక సంవత్సరాల తరువాత జరిగింది. బరంపురంలో నానా జాతి భోజనం కూడా ఆ యేడే జరిగింది. (పే : 26). పత్రికలు తిరగేస్తే అలాగే ఇంకా ఎన్నో చరిత్ర ప్రసిద్ధమైన సంఘటనలు జరిగిన ఆ సంవత్సరంలోనే శ్రీశ్రీ పుట్టాడు. అంటే ప్రజాస్వామ్య విప్లవాల యుగమైన ఇరవయ్యో శతాబ్దం అయిదు వేల సంవత్సరాలుగా మానవ జాతి ఆలోచనల చుట్టూ పేరుకుపోతున్న ప్రేమ, దేవుడు, నీతి వంటి బూజుపై - నిరంతరం మనిషిలో, అతని భావాల్లో, సామాజిక విలువల్లో జరిగే ప్రగతిపూర్వక మార్పుల్ని అడిమిపట్ట జూసే పాలక వర్గ భావజాలమైన మౌఢ్యంపై, - మృతప్రాయమైన సాంప్రదాయిక విలువలపై, భాషపై, జడత్వంపై - దాడిని ప్రారంభించిన చారిత్రక క్షణంలో పుట్టాడని చెప్పవచ్చు. 1910 లో శ్రీశ్రీ పుట్టడం "కేవలం ఒక కాకతాళీయమైన సంభవం" (పే : 26) మాత్రమే కాని విశాఖపట్టణంలో పుట్టి ఇరవయ్యో శతాబ్దంతోపాటు

ఎదుగుతూ వచ్చిన శ్రీశ్రీ కవిత్వం ఆ చారిత్రిక నేపథ్యంలో పుట్టి పెరిగిన చైతన్య రూపంగా తప్ప అర్థంకాదు.

"విశాఖపట్టణం ఒక నిద్ర. అందులో స్వప్నాలే నా జీవిత సంఘటనలు" (పే : 22) అంటాడు శ్రీశ్రీ. విశాఖపట్నానికి హార్బరు వచ్చినపుడు (1933) శ్రీశ్రీ యవ్వనంలోకి ప్రవేశించాడు. ఆ రోజుల్లోనే వచ్చిన ఆంధ్ర విశ్వవిద్యాలయం లైబ్రరీలో అబ్బూరి రామకృష్ణారావుగారి ప్రోత్సాహంతో ఆయన ఊహలకి రెక్కలు రావడం, "గ్రంథగతమైన మహాకవిత్వాన్ని రక్తమేధోమాంస మజ్జాస్థిగతం" (పే : 24) చేసుకోవడం జరిగింది. "అందరూ ప్రేమగీతాలు రాసే ఆ ఋతువులో నేను పారిశ్రామిక విప్లవాన్ని కౌగలించాను" (పే : 24) అంటాడు శ్రీశ్రీ. అయితే, శ్రీశ్రీ అనుకున్నట్లు విశాఖలో, భారతదేశంలో వచ్చింది పారిశ్రామిక విప్లవంకాదు. రైలుమార్గాలు, హార్బరుల వంటి రవాణా సౌకర్యాల్ని, విశ్వవిద్యాలయాలు, లైబ్రరీల వంటి విద్యాహంగుల్ని బ్రిటిషువాళ్ళు ఇండియాలో ప్రవేశ పెట్టింది ఉత్పత్తి శక్తుల నినుమడింప జేయడానికి కాదు. అంటే పెట్టుబడి రూపేణా కాదు. యంత్రాలైనా, విద్యలైనా సామ్రాజ్యవాద రవాణా, ప్రసార సాధనాలుగానే దేశంలోని భౌతిక శక్తుల్ని, వనరుల్ని కొల్లగొట్టడానికి కావలసిన వాతావరణాన్ని సృష్టించుకోడానికి మాత్రమే వారాపని చేశారన్న విషయం ఇప్పుడు అందరికి తెలిసిన విషయమే. ఇంగ్లండులో, యూరోపులో పారిశ్రామిక విప్లవం జరిగి తద్వారా ఉత్పత్తి అయిన సరుకుల మాయ, మారకపు విలువలు పెట్టుబడికి, పాలకవర్గాలకు అధీనం గానే అయినా సమానత్వం ప్రాతిపదికగాగల సామాజిక సంబంధాల్ని లేక విలువల్ని సృష్టించాయి. కాని భారతదేశంలోకి యంత్రాలతో మాత్రమే దిగుమతి అయిన సరుకుల మాయ, మారకపు విలువలు యాంత్రికంగానే దేశంలో క్షీణదశలో ఉన్న ప్రజల సాంస్కృతిక జీవనంలో అతి బలంగా కరడుకట్టుకుని ఉన్న భూస్వామ్యపు విలువలతో ఢీకొని వాటిని నిరర్థకం చేశాయి. కాని వాటి స్థానే అర్థవంతమయిన విలువల్ని నిలబెట్టలేదు, కాని మానవత్వాన్ని నిర్వీర్యం చేసాయి. ఏ వర్గ సమాజంలోనయినా విలువల మధ్య సంఘర్షణ, ముఖ్యంగా బీద, బిక్కి జనం జీవితాల్లో అత్యంత కఠోరంగా ప్రకటించుకుంటుంది. అలాగే ఉత్పత్తి శక్తుల, ఉత్పత్తి సంబంధాల మధ్య నిజమైన వైరుధ్యం లేకుండా - అంటే ప్రజల భౌతిక జీవనంలో విప్లవాత్మక సంఘర్షణ లేకుండా - వారు సామ్రాజ్యవాదుల కుట్రకు బలై

పోయే వైనం అత్యంత దారుణంగా, భీతావహంగా ఉంటుంది. ఏ జీవనాధారమూ లేక కూలినాలి చేసుకుని బ్రతికే జనం పరమార్థాలనుకునే విలువలన్నీ - నీతి, ప్రేమ, దేవుళ్ళతోసహా - అమ్మకపు సరుకులై పోయి, "నరక" (పే : 96) పడుపుతనంగా మారిపోతుంటే వాళ్ళ జీవితాల్లో ఎవరికైనా కనిపించేవి "భయానక, బీభత్సరసాలే" (పే : 103). వాళ్ళ బతుకులు పిచ్చాసుపత్రిలో అంతం కావలసిన బండలే అవుతాయి. అందుకేనేమో విశాఖపట్టణంలో హార్బరు, విశ్వవిద్యాలయంతోపాటు, శ్రీశ్రీ కంటె ముందుగానే పిచ్చాసుపత్రి వెలసింది. "నా ఆవేశంలో ఆగ్రహం, అనుకంపా సరిసమానంగా తులతూగడానికి విశాఖపట్టణం పెర్రాసుపత్రే కారణం" (పే : 24) అని రెబల్-కమ్-రివల్యూషనరీ అయిన శ్రీ శ్రీ అంటాడు. బహుశా ఆయనలోని, ఆయన కవిత్వంలోని చాంచల్యం కూడ ఈ కాంబినేషన్ ఫలితమే అని అనుకోవచ్చు.

విశాఖ చారిత్రక వాస్తవంతోపాటు, అక్కడి సముద్రం, ఆకాశం కూడా శ్రీ శ్రీపై అత్యంత ప్రభావాన్ని కల్గి ఉన్నాయి. "జీవితానికి ప్రతీక సముద్రం" (పే : 24). ఇంగ్లీషు కవి స్విన్‌బర్న్ అంటే శ్రీశ్రీకి ఇష్టం. ఎందుకంటే ఆయనకు కూడా శ్రీశ్రీకి మాదిరిగానే సముద్రమే ఆవేశం, ఆనందం. అలాగే "చెయ్యి ఎత్తితే చాలు అందుకొచ్చేటంత దూరంలో" ఉండేవి (పే : 30) విశాఖలో ఆకాశం చిన్నతనంలో శ్రీ శ్రీకి. అందుకే కవిగా ఆయన చెయ్యెత్తి ఆకాశపు దారులంట వెళిపోయే "జగన్నాథుని రథచక్రాలను" కొంతలో కొంతయినా భూమార్గానికి పట్టించాలని అనునిత్యం ప్రయత్నించాడు. ఈ ప్రయత్నంలో ఆయన ఎంతవరకు కృతకృత్యుడయ్యాడో ఆయన కవిత్వాన్ని పరిశీలిస్తే కొంతవరకు తెలవ్వచ్చు.

2

జీవితంలోనూ, కవిత్వంలోనూ "నరత"కు కాకుండా "నరక"కే ప్రాధాన్యత నిచ్చే గతితార్కిక వాస్తవతావాది శ్రీశ్రీలో "పాతరాతి యుగం పోయి, కొత్త యుగం ప్రవేశిస్తున్న" (పే : 100) రోజులు 1930వ దశాబ్దం. "ఆకలి దశాబ్దం" (Hungry Thirties) గా పేరు పొందిన ఆ ఆర్థిక మాంద్యపు భయంకర దశాబ్దం మానవతను, మానవజాతిని సంక్షోభింపజేసే, దుర్భర దరిద్రం శ్రీశ్రీని తన కవిత్వాన్ని అమ్ముకునేటట్లుగా, తన మొదటి భార్య శ్రీరంగం వెంకట రమణమ్మను "ఎవడైనా ఒక పెద్ద ఉద్యోగి నాకు నౌకరి ఇస్తాడుగాని, నువ్వందుకుగాను

వాడి దగ్గరకు వెళ్ళగలవా ?" (పే: 93) అని పరిహాసానికైనా అడిగేట్లుగా చేసింది. ఆ పది సంవత్సరాల దరిద్రంలోనే ఆత్మ, భారతీయాత్మలవంటి పరమార్థాల పైరు ధ్యాల్ని, "బీభత్సాలను అనుభవాలతో పడబోస్తూ, జీవితాన్ని కవిత్వంలోకి తర్జుమా చేస్తూ, ఆవేశాలకు ఆకారాలు వెదుకుతూ మహాప్రస్థానం సాగించాను" (పే : 100) అంటాడు శ్రీశ్రీ.

ఆ సమయంలోనే "అరతావుకంటె ఎక్కువ సైజులేని, లండన్‌నుంచి వచ్చిన **Progressive Writers Manifesto**ని చదవమని అబ్బూరి రామకృష్ణారావు శ్రీశ్రీకి ఇవ్వడం జరిగింది. దాని ప్రభావంతోనే "ప్రతిజ్ఞ" అనే గీతం రాశానంటాడు శ్రీ శ్రీ (పే : 122). ఈ గీతం రాయబడిన లేక మొదటిసారి ప్రచురించబడిన తేదీ విశాలాంధ్ర ప్రచురించిన మహాప్రస్థానం ప్రకారం 7-5-37 అంటే 1937 కు ముందు ఏ గేయం కూడా శ్రీశ్రీ తనో మార్క్సిస్టునన్న ఆలోచనతో రాయలేదనే అనుకోవాలి. కాని అతనిలోని నిజాయితీతోకూడిన వాస్తవికతా వాదం (అంటే భౌతికవాదం రియలిజమ్ కాదు) గతితర్కం అతణ్ణి, అతని కవిత్వాన్ని సంప్రదాయ వ్యతిరేకిగా, పురోగామిగా నిల్పాయి.

పారిశ్రామిక విప్లవం భారతదేశంలో జరిగిందా లేదా అన్న విషయం శ్రీశ్రీకి స్పష్టంగా ఆ రోజుల్లో తెలుసునో లేదో కాని బ్రిటిషు వాళ్ళు ప్రవేశపెట్టిన సామ్రాజ్యవాద యాంత్రిక మారకపు విలువను, మన దేశంలోని భూస్వామ్య భావజాలానికి చెందిన ఆధ్యాత్మిక, అధి భౌతిక పరమార్థాల్ని రెంటినీ "చారిత్రక యథార్థ తత్త్వం"లో భాగంగానే భావించాడు అన్న విషయం స్పష్టం. ఆ రెండు రకాల విలువల్ని ఒక పైపు ఈసడించుకుంటూనే సమకాలీన ప్రపంచంలో, భాషలో భాగంగా వాటిని గుర్తించి వాటిని పిడివాద ధోరణిలో నిరాకరించకుండా గతితార్కికంగా భవిష్యత్తుకు బాటలేసే ప్రయత్నంలో భాగంగా వాడుకున్నాడు. దీనికి మహాప్రస్థానంలోని ప్రతి గేయాన్నీ ఉదాహరణగా చెప్పవచ్చు. "ప్రతిజ్ఞ"నే ఉదహరిస్తే.

పొలాలనన్నీ, హలాల దున్నీ,
ఇలాతలంలో హేమం పిండగ
జగాని కంతా సౌఖ్యం నిండగ
విరామ మెరుగక పరిశ్రమించే,

బలం ధరిత్రికి బలికావించే,
కర్షక వీరుల కాయంనిండా
కాలువ కట్టే ఘర్మ జలానికి,
ఘర్మ జలానికి,
ధర్మ జలానికి,
ఘర్మ జలానికి ఖరీదు లేదోయ్!

వాడుక భాషలో ఇలా సాగిపోయే లైన్లలో సంస్కృత పదాల్నే కాకుండా భూస్వామ్య సంప్రదాయంలోని విలువల్ని సూచించే ప్రతీకల్ని, కార్మిక జీవితంలోని విశేషాల్ని ప్రతీకరించే పదాల సరసన నిలబెట్టి (అండర్ లైన్ చేసిన పదాల్లో వలె) కర్షకుల, కార్మికుల శ్రమైక జీవన సౌందర్యాన్ని గానం చేస్తాడు. ఈ కవితా లక్షణాన్ని కొంతమంది విమర్శకులు సాంప్రదాయికత, పురాణ ప్రతీకలు అని వర్ణించారుగాని, ఈ ప్రతీకల్లో సంప్రదాయాని కుండాల్సిన గతానుగతికత్వం (Pastness of the Past), పరమార్థత్వం (absoluteness) అనే లక్షణాలు చిన్నాభిన్నమయి కన్పించకుండాపోయి భవిష్యత్ ప్రపంచాన్ని సూచించే గతితార్కిక లక్షణం చోటుచేసుకుంటున్నది. ఈ గేయంలోనే మరికొన్ని ఉదాహరణలు :

నాలో కదలే నవ్య కవిత్వం
కార్మిక లోకపు కల్యాణానికి,
శ్రామిక లోకపు సౌభాగ్యానికి,
సమర్పణంగా
సమర్చనంగా—
త్రిలోకాలలో
త్రికాలాలలో,
శ్రమైక జీవన సౌందర్యానికి
సమానమైనది లేనేలేదని

అండర్ లైన్ చేసిన పదాలన్నీ భూస్వామ్య భావజాలాన్ని రంగరించుకున్న ప్రతీక లైనప్పటికీ శ్రీశ్రీ ఈ గేయంలోనే చిత్రించ బూనుకునే "యథార్థ జీవిత

యథార్థ దృశ్యం"లో "భావి వేదముల జీవనాదములై" "జగత్తు కంతా చవులిస్తాయి" కాని అవి పురాణార్థంలో వేదాలూ కావు, జీవనాదాలూ కావు.

ఇదే సందర్భంలో వాస్తవికతకూ భాషకూ వున్న సంబంధాన్ని గురించి శ్రీశ్రీ కున్న అభిప్రాయాన్ని కూడా చెప్పుకోవాలి.

వాస్తవికత ఒక ప్రతీక, చిహ్నం. వస్తువుల వాస్తవికత ఒక చిహ్నమయితే ఆ చిహ్నానికి చిహ్నం భాష. అందుచేత భాష విధిగా రెండర్థాలను మోసుకు తిరుగుతూ ఉంటుంది. రెండు కళ్ళల్లోంచి మనస్సులోకి వెళ్ళేది ఒకే వస్తువయి నప్పటికీ అది అనుక్షణం రెండర్థాలతో బైటికి వచ్చేస్తూ ఉంటుంది. (పే : 15)

భూస్వామ్య భావజాలపు ప్రతీకలైన పదాలు, ఒక నూతన వాస్తవికతయొక్క అర్థాల్ని మోసుకు తిరుగాల్సి వచ్చినపుడు అవిచేసే సవ్వడే వేరని అర్థం చేసుకున్న శ్రీశ్రీ తెలుగు భాషకు, కవిత్వానికి విప్లవాన్ని నూరిపోశాడని చెప్పవచ్చు.

కవి మనస్సును అనుభవాల సముద్రంగా, ఆశయాల ఆకాశంగా వర్ణించవచ్చు. ఢిల్లీ, లక్నోలలో కొద్దికాలం జీవించిం తర్వాత దగ్గరగా సముద్రంలేని ప్రదేశంలో జీవించడం కష్టం అనిపించింది అంటాడు శ్రీశ్రీ.కాని ఆయన జీవితం ఎక్కువగా జన సందోహంగల నగరాలకే పరిమితమైంది-ముఖ్యంగా మద్రాసు. తనని తాను సము ద్రంలో- జన సముద్రంలో మాతృ గర్భ సముద్రంలో, కవితా మాతృ గర్భసము ద్రంలో, రోదసిలో భాగంగా ఊహించుకోవడానికి ఇష్టపడతాడు. ఇక ఈ సముద్రాల్లో చెలరేగే ఝంఝలు, ప్రళయాలు, ఆవర్తాలు, జ్వాలలు, "కడలి వలపు, వలపు కడలి"— ఆగ్రహం, అనుకంపా, ఆవేశం, ఆలోచన - అన్నీ పెనవేసికొని శ్రీశ్రీ కవితాసముద్రం అవుతుంది.

"జీవితంలోనూ, కవిత్వంలోనూ నడకకే అత్యంత ప్రాధాన్యం ఇచ్చే శ్రీశ్రీ వీధులంట వంకర టింకర్లుగా, డొంక తిరుగుళ్ళుగా నడచుకుంటూ పోయేప్పుడు కూడా ఆ అడుగుల చప్పుడులో తన గుండెల్లోని సిస్టోలీ, డయాస్టోలీ క్రమం తప్ప కుండా గానం చెయ్యడం వినేవాడు (పే : 38). గుండెల్లో రక్త చలనం గతి తార్కికమైంది. అలాగే మహాప్రస్థానంలోని ప్రతి గేయంలోనూ శ్రీశ్రీ రక్త

చలిన సంగీతాన్ని పొందపరచాడు. ఆయన కవితా హృదయంలోని ప్రతి గేయం సిస్టోలీ లేక డయాస్టోలీ గతిలయలు ప్రస్ఫుటించి గతితార్కిక భౌతిక వాద కవిత్వానికి మచ్చుతునక అవుతుంది.

సింధూరం, రక్తచందనం,
బందూకం, సంధ్యారాగం,
పులిచంపిన లేడి నెత్తురూ,
ఎగరేసిన ఎర్రని జండా,
రుద్రాలికనయన జ్వాలిక,
కలకత్తాకాళిక నాలిక
కావాలోయ్ నవకవనానికి"
("నవకవిత", 3-8-37)

నవకవితకు అవసరమైన పదార్థాలుగా ఇచ్చిన ఈ లిస్టులోని విషయాలన్నీ కవిత్వానికి ఏ విధంగా పనికి వస్తాయి! ఇవన్నీ అర్థం పర్థం లేని పదాల కూడిక అని ఎవరైనా అనవచ్చు. ఈ పదాలన్నిటికీ గతానుగతికత్వం, పారమార్థికత్వం వంటి గుణాలున్నాయనీ అనవచ్చు. నిజమే! కాని ఈ కవితలో శ్రీశ్రీ అనుసరించిన గతిలయ డయాస్టోలీ నాలుగవ పద్యభాగం (Stanza) తో గాని పూర్తి కాదు :

కదలేదీ కదలించేదీ,
మారేదీ మార్పించేదీ,
పాడేదీ పాడించేదీ,
పెనునిద్దర వదిలించేదీ,
మును ముందుకు సాగించేదీ,
పరిపూర్ణపు బ్రతుకిచ్చేదీ,
కావాలోయ్ నవకవనానికి

ఈ పద్యభాగాన్ని చివరికంటా చదివేలోగా మన గుండె కవితావేశంతో ముప్పిరిగొంటుంది. మొదటి మూడు పద్యభాగాల్లో పేర్చిన పదాలన్నీ అర్థం పర్థం

లేనివే. వాటిలో నిశ్చిర్థాతాలు పృగ్యం. కాని వాటిని నేర్పుతో పేర్చినపుడు వాటి నడకలో అవి పరస్పరం ఒరుసుకునే రీతిలో, వాటి స్థల, కాల నిర్ణాయక తత్వం ("రగులుకొనే రాక్షసి బొగ్గూ", "పొగగొట్టపు ఘూంకారధ్వని" వంటి పారిశ్రామిక ప్రతీకల్లో) లో వీటన్నిటి ఘర్షణలో ఒక రకమైన వేడి పుడుతుంది. కాని ఆ వేడి కూడా మొదటి మూడు పద్యభాగాల్ని కవిత్వంగా మార్చలేదు. చివరిదైన నాలుగవభాగం వరకు వచ్చే వరకు మొదటి మూడు భాగాల్లోంచి పెల్లుబికిన కవితా శక్తిని కవిత్వం యొక్క గతి తార్కిక శక్తిగా నిర్వచించి దాన్ని ఒక సామాజిక శక్తిగా, మానవతా విలువగా వర్ణిస్తాడు శ్రీశ్రీ.

"నవకవిత"ను డయాస్టోలీ గతిలయకు ఒక ఉదాహరణగా తీసుకుంటే "జయభేరి" ("నేను సైతం ! ప్రపంచాగ్నికి ....") ని సిస్టోలీ గతిలయకు ఉదాహరణగా తీసుకోవచ్చు. అలాగే, "కవితా ! ఓకవితా !" గీతాన్ని శ్రీశ్రీ కవితా సముద్రంగా వర్ణిస్తే దానిలోని లయను "ప్రపంచ పరిణాహం" లో భాగంగా ప్రయాణించే శ్రీశ్రీ విహ్వాలించి వదలిన నిట్టూర్పుల -

.... నా ఊహాంచల
సాహసికాంసం కప్పిన
నా నిట్టూర్పు

ల — గతిలయగా తీసుకోవచ్చు. మాతృగర్భంలోని amniotic fluid లో ఈదే పిండం శిశువుగా "అహం" అనే ఆకలిని సంతరించుకున్న క్షణంనుండీ, "బహిరంతరింద్రియాలలో ప్రాణం" ప్రసరించి భూలోకంలోపడి, సుఖదుఃఖాల నోర్చుకుంటూ "ప్రపంచ పరిణాహం" లో భాగంగా తన సామాజిక బాధ్యతను గుర్తెరిగిన మనిషిగా, కవిగా, తన పాత్రను తాను - తు. చ. తప్పకుండా కాదు - గతితార్కికంగా నిర్వర్తిస్తానని కవితా జననికి మాట యిచ్చాడు శ్రీశ్రీ ఈ కవితలో.

అయితే ఈ కవితలోని "ఆకలి" కి "కేక" (26-6-39) అనే కవితలోని "ఆకలి"కి అర్థం ఒకటి కాదు. "కేక" లోని ఆకలి వ్యక్తిగత నిర్వేదంలోంచి వచ్చింది. శ్రీశ్రీలో మొదటనుంచీ - ముఖ్యంగా 1937 నుంచీ - ఉన్న సామాజిక

స్పృహలో భాగంగా ఈ ఆకలి వర్గ దృక్పథాన్ని పొందటం ఈ దశాబ్దం చివరి వరకు (1940) గాని జరుగలేదు.

"నా రచనలో లోకం ప్రతిఫలించి,
నా తపస్సు ఫలించి,
నా గీతం గుండెలలో మూర్ఛిల్లగ
నా జాతి జనులు పాడుకునే
మంత్రంగా మోగించాలని,
నా ఆకాశాలను
లోకానికి చేరువగా,
నా ఆదర్శాలను సోదరులంతా పంచుకునే
వెలుగుల రవ్వల జడిగా
.... నానుడి నీ గుడిగా...."

ఇది 1937లో శ్రీశ్రీకి కవిత్వం గురించిన సామాజిక అవగాహన అయితే "జగన్నాథ రథ చక్రాలు" (1940) రాసేనాటికి అతనిలో ఏర్పడ్డ వర్గ దృక్పథం ఈ క్రింది లైన్లలో కన్పిస్తుంది :

"పతితులార! భ్రష్టులార!
దగాపడిన తమ్ములార!
మీ కోసం కలం పట్టి,
ఆకాశపు దారులంట
అడావిడిగ వెళిపోయే,
అరుచుకుంటు వెళిపోయే
జగన్నాథుని రథచక్రాల్,
రథ చక్ర ప్రళయ ఘోష
భూమార్గం పట్టిస్తాను!
భూ కంపం పుట్టిస్తాను!"

ఆకాశపు దారులవెంట అడావిడిగ అరుచుకుంటూ వెళ్ళిపోయే జగన్నాథుని రథచక్ర ప్రళయఘోష అంటే శ్రీశ్రీ ఉద్దేశ్యంలో ఏమయ్యుంటుంది? అన్న ప్రశ్నకు సమాధానం శ్రీశ్రీ కవిత్వాన్ని అర్థం చేసుకునే క్రమంలో చాలా అవసరం. వర్గ సమాజంలోని "నిశ్చల నిశ్చితా" ("వ్యత్యాసం" మహాప్రస్థానం 25-4-37) లను అంటే పరమార్థాలను ఉన్నవాళ్ళ అంటే పాలకవర్గాల చేతుల్లో ఆయుధాలుగా భావించే శ్రీశ్రీ "జగన్నాథుడు" అన్నపదాన్ని దేవుడు అన్న అర్థంతో ఎప్పుడూ వాడలేదు. వాస్తవికతను నిజాయితీతో పరిశీలించి గుర్తించే గుణం అతణ్ణి గతితార్కిక భౌతికత వైపు అంటే వైజ్ఞానిక దృక్పథంవైపు, అక్కడినుంచి సామాజికస్పృహ, వర్గ దృక్పథం, మార్క్సిజంవైపు తిప్పింది. ఈ మార్పులో భాగంగానే ఆ చిన్నప్పటి ఆస్తిక భావం (అదెప్పుడూ శ్రీశ్రీకి vested intesrt కాదు.) నుండి 'సద సత్సంశయం,' అజ్ఞేయవాదం గుండా దేవుడు లేడు అనే నాస్తికవాదం వరకు ఎదిగాడు శ్రీశ్రీ. ఈ దృష్టివల్లనే ఆయన మార్పు అనేది ప్రపంచంలో నిరంతర సత్యమని గ్రహించాడు. అయితే ఇప్పటివరకు భారతీయ వేదాంతులు ఆ మార్పును అభావం చేసి శాశ్వతత్వాన్ని, దానికి ప్రతీకలుగా దైవం, కాలంవంటి అబద్ధపు విలువల్ని సృష్టించి పాలకవర్గాల కొమ్ము కాశారు. కళలు, కవిత్వంకూడా అటువంటి కల్పనా ప్రపంచంలో భాగం అయ్యాయి. కాని "అందమైన అబద్ధాలను గాక నిష్ఠురమైన నిజాన్నే" (పే: 124) ఆరాధించే శ్రీశ్రీ "కల్పనా ప్రపంచంనుండి కవిత్వాన్ని వాస్తవ లోకానికి మళ్ళించడమే" (పే. 124) ధ్యేయంగా పెట్టుకున్నాడు. అట్లాగే, శ్రీశ్రీకి జీవితం, కవిత్వం వేర్వేరు విషయాలుకావు. కాబట్టి జీవితంలో, కవిత్వంలో రెండింటిలోనూ, దగాపడిన తమ్ముళ్ళకోసం కలంపట్టి పెద్ద అబద్ధంలో చిక్కుకున్న వాస్తవికతను భూమార్గం పట్టిస్తానంటాడు. దేవుడు అన్న అబద్ధంనుంచి "జగన్నాథుడు" అన్న పదార్థాన్ని (పరమార్థం లేక నిశ్చల నిశ్చితార్థాన్ని) విడదీసి చూస్తే "జగన్నాథుని రథ చక్రాల్, రథ చక్ర ప్రళయఘోష" ను భూ మార్గం పట్టిస్తాను అన్నమాటలు విప్లవాన్ని, వర్గ పోరాటాన్ని సూచిస్తాయి అన్న విషయం స్పష్టమవుతుంది.

మనుష్యుడే నా సంగీతం

మానవుడే నా సందేశం అని "మహా సంకల్పం" (ఖడ్గసృష్టి) లో నిర్ద్వంద్వంగా ప్రకటించి వర్గసమాజపు వాస్తవాన్ని ఈ శతాబ్దిపు తెలుగు కవిత్వంలో

తప్పించుకోలేని నిజంగా చేసినకవి శ్రీశ్రీ జగన్నాధుని రథ చక్రాలను చాలావరకు కవిత్వంతో భూమార్గం పట్టించాడని చెప్పవచ్చు.

అలాగే శిల్పం విషయంలో కూడ. ఫ్యూడల్ యుగానికి ప్రతీకలైన నాలుగు పాదాల పద్యాలను కాదని, ధూమ శకటాలవంటి మాత్రాచ్ఛందస్సుల్నీ విమానాల వంటి వచన గేయాల్నీ తెలుగు కవిత్వంలోకి 1930 లలోనే ప్రవేశపెట్టిన వాళ్ళలో శ్రీశ్రీ ప్రముఖుడు. 20వ శతాబ్దంలో జీవించిన వాస్తవిక వాదిగా, కవిగా, ఎప్పుడూ ఏదో కొత్తతనం కోసమే అన్వేషించాడు. "సైన్సుకిలాగే, కవిత్వానికి కూడా ప్రయోగాలు లేనిదే అభివృద్ధి లేదు" (పే. 171) అని నమ్మినవాడాయన.

"రకరకాల ఛందస్సులతో సాముగరిడీలు చేస్తూ అదే కవిత్వం అనుకోవడం నాకు Edgar Allen Poe నుండి సంక్రమించిన వ్యాధి అనుకుంటాను" (పే.129) అని నిశితంగా ఆత్మవిమర్శకు పూనుకోవడం అతని నిజాయితీనే గాక కవిత్వంపట్ల ఆయన ఫీలయిన బాధ్యతను సూచిస్తుంది. "సంవిధానమే సమస్తమూ" "Technique is everything) (పే. 129) అని తాను కవిత్వం రాయడం మొదలుపెట్టిన చాలా కాలం వరకు (భావకవిత్వపు రోజుల్లో) అనుకున్నవాడే అయినా, అది కరెక్టు కాదనీ ఎలా చెప్పడం అనే దానికన్నా ఏది చెప్పడం అంటే వస్తు ప్రాధాన్యత ముఖ్యమని గుర్తించినా టెక్నిక్కు అనవసరమని కొట్టిపారేయడం కూడా తప్పని, అలాగయితే కవిత్వం రాయడమే అనవసరమని కుండబద్దలు కొట్టినట్లు చెప్పే నిష్కపటి ఆయన. అందుకే భుక్తి కోసం సినిమాల్లో చేరినా మానవుడే సందేశంగా కవిత్వాన్ని, ప్రస్తుతాన్నే ప్రస్తుతిస్తూ ప్రయోగరీత్యా కవితల్ని, పాటల్నీ కూడా ఎన్నిరకాల రాయవచ్చో అన్నిరకాల రాశాడు. సర్రియలిజమ్, క్యూబిజమ్ మొదలగు పాశ్చాత్య కవితోద్యమాలను స్టడీచేసి ఆ ఫక్కీలో ప్రయోగాలు చేశాడు. ముఖ్యంగా మహాప్రస్థానం తరువాత. మొదటనుండీ ప్రజల బతుకులో ప్రబలుతున్న సంచలనాన్ని చూసినవాడు కాబట్టి దాన్ని ప్రతిఫలించే పాటకు జనుల పాటతోగూడ పరిచయం పెంచుకున్నాడు. ఇదే సందర్భంలో శ్రీశ్రీకున్న సంగీత పరిచయం గురించి కూడా చెప్పుకోవాలి. తిరిగి చూసుకుంటే తనకు వచ్చిన రాగాలు 40 వరకనీ తెలిసిందని అంటాడు శ్రీశ్రీ (పే. 119). సంస్కృత, తెలుగు, ఇంగ్లీషు భాషల్లోని ఛందస్సులతో, బొడిలేర్,

పాల్ ఎలార్డులవంటి సింబలిస్టు కవుల పరిచయంతో గురజాడ చూపిన బాటలో మహా ప్రస్థానం నుండి మరో ప్రస్థానందాకా ఎక్కడా ఆగకుండా ప్రయాణించాడు. వేమన గీతపద్యాల్నీ, కవి చౌడప్ప కందపద్యాల్నీ, సర్రియలిజాన్ని లిమరిక్కుల్నీ, ఋక్కుల్ని కలిపి కవితారీతుల మధ్య ఎల్లల్నీ, దూరాన్నీ చెరిపేశాడు.

మద్రాసు సినీ ప్రపంచంలో కాందిశీకుడైన తరువాత విరసం పుట్టుక వరకూ ప్రయోగాత్మకమైన జర్నలిస్టు కవిత రాస్తూనే ఉన్నాడు తెలుగు కవిత్వంలో ఈ రకమైన కవిత్వానికి అద్యుడే కాదు, మకుటంలేని మహారాజని చెప్పవచ్చు. ఇందులో కూడ 30 లలో ఏ రకమైన పరమార్థాలను, నిశ్చల నిశ్చితాలను వ్యతిరేకిస్తూ కవిత్వాన్ని ఆయుధంగా చేపట్టాడో ఆ కుళ్ళిపోతున్న భూస్వామ్య విలువలకు, సామ్రాజ్యవాద కుట్రకు వ్యతిరేకంగా ధ్వజమెత్తాడు. ఉదాహరణకు సిరిసిరిమువ్వల్లో (ఆంధ్ర జ్యోతి మాసపత్రిక), తెలుగుదేశంలోని పెద్దల్ని ఉద్దేశించి

పాతబడి కుళ్ళిపోయిన
నీతులనే పట్టుకుని మనీషులమంటూ
నూతన జీవిత లహరికి
సేతువు నిర్మింతురేల? సిరి సిరి మువ్వా, (జనవరి 1946)
గడియారము వెనుకకు త్రి
ప్పెడువారే నేడుమనకు పెత్తనదారుల్ (ఫిబ్రవరి 1946)

స్వాతంత్ర్యం తరువాత కూడా భారతదేశ సామాజిక స్థితిలో, బడుగువర్గాల జీవితాల్లో భేదం లేకపోగా ఇంకా నికృష్టంగా తయారైన బీభత్స నిజాన్ని సర్రియలిస్టు ధోరణిలో మేమేలో ప్రదర్శిస్తాడు.

"చిరిగిన చెడ్డీలం చెరలో కడ్డీలం
మృత్యువు రవికలో పగిలిన పాల బుడ్డీలం
భగవంతుని కన్నీళ్ళం ముచ్చటగా మూన్నాళ్ళం
త్రాగనేని బాజాలం వెనక్కి మరిపోజాలం"
(1954)

బీదా బిక్కీ ప్రజల్ని మనుష్యులుగా అభ్రావం చేసే వ్యవస్థని అభావం చేయగల శక్తిని, వర్గ కసిని రేకెత్తించగల చరణాలివి. బలమైన అంత్యప్రాసలు కవిత్వంలో వర్గపోరాట లక్షణాన్ని, ధిక్కారాన్ని చికురింపజేస్తాయి. ఆగ్రహం, అనుకంపా రెండూ సమతుల్యాలు ఈ లైన్లలో.

ఇలాగే ప్రతి కవిత వర్గ పోరాటపు గతితర్కం ఊపిర్లు పీలుస్తూ బడుగు వర్గాల ఆర్థిక స్వాతంత్ర్యం యొక్క అవసరాన్ని డైరెక్టుగానో, ఇండైరెక్టుగానో నొక్కి చెప్పుతుంది. కాని "స్వాతంత్ర్యం" వంటి నియో-పరమార్థాల గురించి గాని, భూస్వామ్య విలువల్నీ, బూర్జువా రాజకీయాల్నీ కలిపికొట్టే కొత్త వర్గ సంస్కృతి కంపు అయిన ఉద్యమాల జోలికసలు పోడు. ఆ విలువల్ని, రాజకీయాల్ని ప్లే చేసే వ్యక్తుల్ని, పత్రికల్ని విమర్శించడానికి తప్ప. అయినా ఉద్యమాల్ని ఉద్యమాలుగా శ్రీశ్రీ ఎప్పుడు విమర్శించడం జరగలేదనే చెప్పాలి. ఉద్యమాల్లో తప్పో రైటో ప్రజల ఇన్‌వాల్వ్‌మెంటు ఉంటుంది కాబట్టి. ఉదాహరణకు, ప్రాస క్రీడల్లో

ముక్కుపచ్చలారని న
వ్యాంధ్ర రాష్ట్ర శిశువు
మూలుగుతూ మూలనున్న
ముసిలాడికి వధువు
స్వామీ సీతారామ్ జీ
సర్వోదయ పంథీ
యథాశక్తి సత్యాగ్రహి
పదోపంతు గాంధీ
అరె యార్ ఇధరావ్ దేఖో
ఆంధ్రుల దినపత్రిక
పెట్టుబడికి కట్టుకథకి
పుట్టిన విష పుత్రిక (1953)

లిమబుక్కులు ఇంగ్లీషులోని లిమరిక్కులను మన బుక్కులను కల్పి శ్రీశ్రీ చేసిన విశ్వామిత్ర సృష్టి. ఒక భాషలో పదాలను, అర్థాలను రూపాన్నీ, భావాన్నీ శిల్పాన్నీ వస్తువునూ కల్పి కవిత్వాన్ని సృష్టించడమే కాదు. వేర్వేరు సంస్కృతుల్లో విలసిల్లిన రూపాల్ని సంయోగం చేసి ఒక కొత్త కవితా రూపానికి ఊపిరి పోసి, దానికి గతి తార్కిక చైతన్యాన్ని సమకూర్చి పెట్టడం శ్రీశ్రీ వంటి మహాకవికే సాధ్యమౌతుంది. "లిమ బుక్కు"ల్లో మాజీ కమ్యూనిస్టుల విమర్శించే పద్యం టాప్.

K. G. దాటని—
మాజీ కమ్యూనిస్టులు
ఈజీ బతుకుల కిష్టులు
రాజీ భావాకృష్టులు
నాజీ భూతావిష్టులు
ట్రాజీ - కామికల్ నియోకేపిటలిస్టులు (1970)

అది, అంత్య ప్రాసల్తో ప్రవేశమేగాని తప్పించుకొనే మార్గంలేని లిమ బుక్కు నరకాన్ని సృష్టించాడు శ్రీశ్రీ "మాజీ కమ్యూనిస్టుల"కోసం, ఈ పద్యంలో.

ప్రతి కమ్యూనిస్టుకు మనస్సాక్షిగా పనికి రాగల గతితర్కం దీన్లో ఉంది. కమ్యూనిష్టంటే నిరంతర పోరాట శీలి. తన లెవెల్లో తానుచేసే పోరాటం ఆపిన మరు క్షణం ఈ లిమబుక్కు నరకం బిగాలతని చుట్టూ బిగుసుకొని పోపడం మొదలౌతుంది. ప్రతీప శక్తుల్లో కలిసిపోయిన మాజీ కమ్యూనిస్టుల్ని వారిచేతల దారుణ, మారణ, బీభత్స, హాస్యాస్పద లక్షణాలన్నీ కలిపి "ట్రాజీ – కామికల్" అన్న ఒక్క మాటలో నిర్వచించడం అనన్య సాధ్యమైన పని.

శ్రీశ్రీ లిమబుక్కులు రాస్తున్న సమయంలోనే విరసం ఆవిర్భవించింది. విరసం తనకు పునర్ యవ్వనాన్నిచ్చిందని శ్రీశ్రీ అంటాడు. కవిత్వానికి పునర్యవ్వనం ఇచ్చిందని శ్రీశ్రీ అర్థం అయ్యుంటుంది దానికి. తానే కవిత్వంగా మారి

పోయిన శ్రీశ్రీలో కాదు, కాని సామాజిక వాస్తవికతలో, గుణంలో, రాశిలో వైరుధ్యాలు ఎక్కువయి ప్రతీపశక్తుల రక్కసి నాట్యం బాగా ఎక్కువయి పోతున్నది. ఇప్పుడు కావలసింది ఒక్క శ్రీశ్రీ గాదు, అనేక శ్రీశ్రీలు ఒక్క శక్తిగా విరసంగా ఆవిర్భవించడం. శ్రీశ్రీ తన కవిత్వంలో ఏ చారిత్రక బాధ్యతను నిర్వహించాడో ఆ బాధ్యతను గతి తార్కిక భౌతికత ఆధారంగా మార్క్సు, లెనిన్, మావోల ఆచరణ, సిద్ధాంతం ఆధారంగా గురజాడ, శ్రీశ్రీలు చూపించిన బాటలో వర్గపోరాటంలో భాగంగా ఎంతోమంది కవులు కవిత్వం రాయబూనారు. శ్రీశ్రీ కూడా వారితో కలిసి తన మహాప్రస్థానంలో మరో మజిలీని, మరోప్రస్థానం (1980), చేరుకున్నాడు.

ఈ కవితల్లో మహాప్రస్థానం కవితల్లో మాదిరిగా ఆకాశం నుండి భూమికి దిగివచ్చే జగన్నాథుని రథ చక్ర ప్రళయ ఘోష విన్పించదు. దానికి కారణం ఆ విషయంలో శ్రీశ్రీ ప్రయత్నం సంపూర్ణంగా విజయవంతమైంది. అందుకు తార్కాణం విరసం పుట్టుక. విప్లవం అన్న భావానికి సర్వత్రా వచ్చిన సమ్మతికి తార్కాణం నకిలీ జ్ఞానపీఠ అవార్డు అని చెప్పవచ్చు. నిజానికి జ్ఞానపీఠ అవార్డు, శ్రీశ్రీ తన పరిధుల్లోనే అయినా కవిత్వాన్ని వర్గపోరాటంలో భాగంగా చేయడాన్ని వ్యతిరేకించే అవార్డు. ఈ వైరుధ్యమే శ్రీశ్రీ కవిత్వం ఎంతగొప్పదో తెల్పుతుంది.

కవిత్వంలో నైనా, జీవితంలో నైనా శ్రీశ్రీ చలనంలోనే "చల చంచల సౌందర్యా"న్ని దర్శిస్తాడు. 1977 లో సర్రియలిజాన్ని గురించి చర్చిస్తూ చెప్పిన మాటలు ఆయన కవిత్వానికి అక్షరాలా సరిపోతాయి.

"ఒక వస్తువు చలనంలో ఉన్న క్షణాన్ని, అదే వస్తువు సరిగా చలనం ఆగిపోయిన క్షణంతో కలిసేటప్పుడు స్ఫురించేపరస్పర సంబంధాన్ని ప్రదర్శించేదే సంశ్లిష్ట సౌందర్యం" (పే: 174)

ఈ సౌందర్యమే నిజమైన కళకు, కవిత్వానికి, జీవితానికి ప్రాణం. ఈ సౌందర్యాన్నే శ్రీశ్రీ భూమార్గం పట్టించి మనందరికీ చూపించాడు. ఒక మంచి కమ్యూనిస్టు కావలసిన అవసరం కూడా ఈ సౌందర్యాన్ని దర్శించేందుకే అంటాడు శ్రీశ్రీ ఒక మరోప్రస్థానం గీతంలో.

కరపత్రం :

కోటా చాలదు, ఎర్రకోటే కావాలి !

ప్రతిభను రక్షించుకోవాలి!
ఏ ఏకలవ్యుడి బొటనవేలూ తెగిపోకూడదు.
ఏ శంబూకుడూ అవతార పురుషుల చేతిలో మరణించకూడదు.
ఏ కర్ణుడూ శాపగ్రస్తుడు కాకూడదు.
జ్ఞానానికి చెవియొగ్గే ఏ మనిషి చెవిలోనూ సీసం కుమ్మరించకూడదు.
మనుషులందరిలోనూ తొణికిసలాడే జీవశక్తిని ఎవరూ చిదిమివేయకూడదు.
ప్రతిభను మనం రక్షించుకోవాలి.
మట్టిలోని సారమంతా తానొక్కటే పీల్చి
మరే మొక్కనూ ఎదగనీయని వటవృక్షాలను నరికి అయినా సరే,
పది చిన్న మొక్కల్ని మనం ఎదగనివ్వాలి.
కానీ,
నేటికీ ద్రోణుని అభిజాత్యం ఉంది.
శ్రీరామచంద్రుని వారసత్వమూ ఉంది.
పరశురాముల ద్వేషమూ ఉంది.
అంబేద్కర్ మెడలో చెప్పుల దండ తగిలించే మనుస్మృతి ఉంది
ప్రజల ప్రతిభను ఉక్కుపాదంతో అణచివేసే రాజ్యాంగ యంత్రం ఉంది.

అవతలివాడు తిరిగి నన్ను కొట్టడంతో తగువు మొదలయింది అన్నాడట వెనుకటికో ప్రతిభావంతుడు! కులతత్వం వల్లనే రిజర్వేషన్లు అవసరమైన తరుణంలో రిజర్వేషన్ల వల్లనే కులతత్వం పుట్టుకొస్తుంది అంటున్నారు నేటి ప్రతిభావంతులు. ప్రభుత్వం ఇచ్చిన 'ఫ్రీ హ్యాండ్'తో బీభత్సం సృష్టిస్తున్న 'మెరిట్ విద్యార్థులకు' తమ తలకిందుల ప్రతిభ సంగతి ఎప్పుడు అర్థమవుతుంది? సామాజిక అవగాహనలో తమకు 'జీరో' మార్కులు వచ్చాయని ఈ మందమతులకు ఎప్పుడు తెలుస్తుంది?

కులం ఆధారంగా రిజర్వేషన్లు ఇస్తే ప్రతిభ నాశనమై పోతుందని 'మెరిట్' వాదన. అంటే రిజర్వేషన్లు వర్తించని కులాల వారు, అంటే అగ్రవర్ణాల వారు మాత్రమే ప్రతిభావంతులని సారాంశం. ప్రతిభకు కుల ప్రాతిపదిక ఉంటుందట కాని, రిజర్వేషన్లకు ఉండకూడదట, పాపం ! ఆ ప్రతిభ కొన్ని కులాలకే ఎందుకు గిరి గీసుకుందో?

భారతదేశ చరిత్ర గురించి, సమాజం గురించి ఓనమాలు కూడా తెలియని 'జీరో'లు మనకు 'ప్రతిభ' లేదంటున్నారు కదా అని కించపడడం శుద్ధదండుగ. మాకూ ప్రతిభఉందని ఏవో ఆధారాలు ప్రదర్శించనక్కరలేదు. ఫలానా కారణాలవల్ల ఇలా చదువురాని (మార్కులురాని) మొద్దులమయ్యామని వినయంగా వివరణ ఇవ్వ నవసరంలేదు. వారు నాశనమవుతోందని గగ్గోలు పెడుతున్న ప్రతిభ నాశనం కావల సిందే! ఆ ప్రతిభ, మన ప్రతిభ ఒకటికావు.

కౌటిల్యుల ప్రతిభ, మనువుల ప్రతిభ నాశనం కావలసిందే! మనుష్యుల్ని విడ దీసి పాలించే ప్రతిభ, పన్నులు ఎగవేసే ప్రతిభ, దొంగసాక్ష్యాల ప్రతిభ, నల్ల వ్యాపా రం సాగించే ప్రతిభ, టేబుళ్ళ కింద చేతులు చాచే ప్రతిభ, ప్రైవేట్ ప్రాక్టీస్ ప్రతిభ, బూడిద డ్యాములు, గోతుల రోడ్లు నిర్మించే ప్రతిభ, లాకప్పులో చ పి నకిపీఠిలో వేలాడదీసే ప్రతిభ, రిగ్గింగ్ ప్రతిభ, ఎన్‌కౌంటర్ల ప్రతిభ, దేశాన్ని రెండు స్విస్ అకౌంట్ల కోసం అమ్మేసే ప్రతిభ—ఈ ప్రతిభా పాటవాలన్ని సర్వనాశనం కావల్సిందే.

సామ్రాజ్యవాదులూ, ప్రజాద్రోహులూ కాగితం పులులయినట్టే,

ఈ వంచనా శిల్ప ప్రతిభావంతులు కాగితం పూవులు !!

శ్రమ పరిమళం అంటిన ప్రతిభ మనది. వేదాలు వల్లించి శ్రుత పాండిత్యంతో మురిసిపోయి, కనబడని లోకాలను కనికట్టులో వారు ప్రదర్శిస్తున్నపుడు మనం, మనమే ఈ దృశ్య ప్రపంచాన్ని మనోహరంగా మలిచాం. బండరాళ్ళను కమనీయ శిల్పాలుగా మలిచాం. అరచేతిలో ఇమిడే అపురూప వస్త్రాలను నేసాం ! నేలతల్లిని తలకిందులు చేసి బంగారం పండించాం. ఊపిరితిత్తులతో కొలిమిని మండించి లోహాల చేత దాసోహం అనిపించాం. యంత్ర భూతాల కోరలు తోముతున్నాం. దగ్గులతో క్షీణిస్తూ బొగ్గుల గుట్టలు తవ్వుతున్నాం. భాక్రా నుంచి శ్రీశైలం దాకా మన రక్త మాంసాల నిర్మాణాలే. మనకెవరి కితాబులూ అక్కరలేదు. సమస్త సంపదా మన సృష్టే. ఈ సంపదలో మనకు భాగం కావాలి. దీనికి ఏ సైంధవ ప్రతిభా అడ్డు రాకూడదు. పల్లెటూరి మొహం తెలీనివాడు: పంచెకట్టుకొస్తే "ఊరోడా!" అని వెక్కిరించేవాడు, జనాభాలో 70 శాతం మంది తెలివితేటలు లేని దద్దమ్మలని నిందించేవాడు, ఆ పల్లెటూళ్ళ కష్టార్జితాన్ని, ఆ తెలివిలేని ప్రజల కష్టాన్ని అనుభ వించడాన్ని క్షేమం ఒప్పుకోం.

వీళ్ళు ఉద్యోగస్థులైతే ప్రజల్ని అవమానిస్తారు.
డాక్టర్లయితే నిరుపేద రోగుల్ని చంపుతారు.
ప్రణాళికలు రాస్తే పక్షపాతం ప్రదర్శిస్తారు.
పాలకులయితే దేశాన్ని అమ్మేస్తారు.
మేం ఒప్పుకోం నీమార్కులన్నీ రద్దు
నీ ప్రతిభను పటం కట్టి దాచుకో
దొంగ లెక్కలు రాసుకో
నీ ప్రతిభతో మమ్మల్ని ఉద్ధరించే వ్యవస్థను
రద్దు చేస్తున్నాం
నీ చాణక్య ప్రతిభ అంతరించాలంటే
ఈ రిజర్వేషన్ అసలు ఆయుధమే కాదు
పూచిక పుల్ల
కల్లోల జిల్లాల నుండి ఢిల్లీ గద్దె కిందికి
భూప్రకంపనాలను ప్రసారం చేస్తున్నది మేమే
లెక్కలు వేసి, సిఫారసులు చేసి అలసిపోతున్న ప్రభుత్వ మేధావులను
అపహాస్యం చేస్తూ, అద్భుత సమాజ సంచలనం
సృష్టిస్తున్న నిరక్షరాస్య గిరిజనులం మేమే.
నీ మను శిబిరంలో బందీలయివున్న
నిరుపేదలను సైతం మాలోకి ఆకర్షించి
నిన్ను ఏకాకిని చేస్తున్నదీ మేమే.
ఢిల్లీ మీదికి దండు కదిలితే
గుండె చెదిరి వాడు 'కోటా' ఇస్తున్నాడు
ముందుంది ముసళ్ళ పండుగ
కోటా కాదు - వాటా కాదు
ఎర్రకోటే కావాలి.

"ప్రతిభా వంతులకు" పది ప్రశ్నలు

1. తరతరాలుగా భూస్వామ్య అధికారాన్ని, రాజకీయ అధికారాన్ని, ఆస్తులనీ వారసత్వంగా అనుభవించేవారు, బి.సి.లకు ఒక తరంలోనే రిజర్వేషన్లు అంతం కావాలని వాదించడంలో ఔచిత్యమేమిటి?

2. మెరిట్ లేని ఒ.సి. విద్యార్థి డొనేషన్లు చెల్లించి చదువుకోగలుగుతున్నాడు. అందువల్ల ప్రతిభ దెబ్బతినదా ?

3. దేశంలోనే అత్యంత సమర్థవంతమైన ప్రభుత్వ యంత్రాంగంగా ఉన్న తమిళనాడులో 71 శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. రిజర్వేషన్లు ప్రతిభను తగ్గిస్తాయన్న మీ వాదన అక్కడ ఏమైంది?

4. జాతీయోద్యమంలో గాంధీ మొదలైన నాయకులు హరిజన వాడలు శుభ్రం చేయడం లాంటి పనులు సంఘ సంస్కరణ కార్యక్రమాల్లో భాగంగా చేశారు. మీరు రోడ్లు ఊడ్వడాన్ని, బూట్లు తుడవడాన్ని నిరసన చర్యలుగా ఎందుకు చేస్తున్నారు? ఈ నిరసన ఆయా వృత్తుల వారిని అవమానించడం కాదా?

5. ఇతర కులాల వారి సంగతేమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా "ప్రతిభను రక్షించండి" అని నినాదం ఇవ్వడంలో అగ్రవర్ణ దురహంకారం, కష్టజీవులపై చిన్న చూపు లేవా?

6. అగ్రకులాల్లో పుట్టడమే ప్రతిభకు కొలబద్దయితే, శూద్రుల్లో భాగమైన కమ్మ, రెడ్డి కులస్థులు ఇప్పుడు మీ ప్రతిభావంతుల్లో ఎలా చేరిపోయారు?

7. ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్ అమలు చేయాలంటున్నారు కదా, ఆర్థిక పరిమితిని ఎలా అమలు చేస్తారు? వ్యవసాయంపై ఆధారపడే కుటుంబాల ఆదాయాన్ని ఖచ్చితంగా లెక్కించడానికి మనకు పద్ధతులున్నాయా? ఈ పద్ధతిలో సంపన్నులు లాభపడే వీలు లేదా?

8. దేశంలోని మొత్తం ఏడు లక్షల దేవాలయాల్లో ఉన్న 35 లక్షల ఉద్యోగాలు ఏ మెరిట్‌తో సంపాదించుకున్నారు?

9. ప్రత్యేక తెలంగాణా ఉద్యమంలో "స్థానికులకే ఉద్యోగాలు" అన్న డిమాండ్ పెట్టి 85 శాతం రిజర్వేషన్ సాధించుకున్నాము. "ఇతర ప్రాంతాల వారు ప్రతిభావంతులు కాబట్టే వారు ఎక్కువ ఉద్యోగాలు సంపాదించుకుంటున్నారు" అని ఎందుకు అనుకోలేదు. ముల్కీ నిబంధనలవల్ల ప్రతిభ దెబ్బతినలేదా?

10. రాజకీయ డిమాండ్లపైనో, ఇతర కారణాలపైనో బి.సి.లు, ఎస్.సి.లు ఎక్కువగా ఉన్న విద్యార్థి ప్రదర్శనలపై కర్కశంగా ప్రవర్తించే పోలీసు, ప్రభుత్వం మీకు "ఫ్రీ హ్యాండ్" ఇవ్వడంలో రహస్యం ఏమిటి? కేవలం మీ ప్రతిభేనా? ఇంకేమైనా ఉందా?

జన చైతన్య సమితి
ఆంధ్రప్రదేశ్

SṚJANA Telugu Monthly September 1990

Regd No. with the Registrar of Newspapers for India 10953/67

SṚJANA Rs. 4/-

Flat 11, Block 2,

MIG II, Baghlingampalli,

Hyderabad-500 044.